# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

రంగారెడ్డి | సంపుటి : 02 | సంచిక: 107 | పేజీలు: 4 | వెల: 4/- | ఆదివారం 10, నవంబర్ 2024 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి




సీ ప్లేన్‌లో ప్రయాణిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



విజయవాడ కృష్ణానదిలోని పున్నమిఘాట్ వద్ద టేకాఫ్ అవుతున్న సీ ప్లేన్

# మోడీ అబద్ధాల ప్రచారం ఆపాలి

- అప్పటి వరకు నిజాలు చెబుతూనే ఉంటాం
- మహారాష్ట్ర ప్రచారంలో సీఎం రేవంత్



**ముంబై, నవంబర్9 (నమస్తే ఉదయం):** మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో ప్రధాని నరేంద్ర మోదీ.. తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని అబద్దాలు చెబుతున్నారని విమర్శించారు. ఆయన అబద్దాలు మాననంత వరకు నిజాలు చెబుతూనే ఉంటామని అన్నారు. తెలంగాణలో ఇచ్చిన అన్ని హామీలు నేరవేరుస్తున్నామని.. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రధాని మోడీ వచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఫైర్ అయ్యారు. విభజన రాజకీయాలతో ప్రజల మధ్య బీజేపీ చిచ్చు పెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంల మీటింగ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తెలంగాణ ప్రభుత్వంపై ప్రధాని మోడీ అబద్దాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. తెలంగాణలో ఇచ్చిన హామీలన్నీ నేరవేరుస్తామని స్పష్టం చేశారు. రైతులకు హామీ ఇచ్చిన మేరకు 22 లక్షల మంది రైతులకు రూ.17 వేల కోట్ల రుణాలు మాఫీ చేశామని తెలిపారు. రైతులపై ప్రధాని మోడీ వేసిన ప్రశ్నలకు నేను సమాధానం చెప్పాక ఆయన పోస్ట్ డిలీట్ చేశారని అన్నారు. తెలంగాణలో అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50 వేల ఉద్యోగాలు ఇచ్చామని గుర్తు చేశారు. రైతులకు సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తున్నాం.. సామాజిక న్యాయం కోసం రాష్ట్రంలో కులగణన చేపట్టామని పేర్కొన్నారు. హామీల వివరాలు కావాలంటే ఇవ్వడానికి మేం సిద్ధమని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రకటించారు. దేశంలోనే ఎక్కువ రైతు ఆత్మహత్యలు మహారాష్ట్రలో మిగతా.. 2లో

## నేడు పాలమూరులో సిఎం రేవంత్ పర్యటన

**హైదరాబాద్, నవంబర్9 (నమస్తే ఉదయం):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ఉదయం మహబూబ్‌నగర్‌లో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ఆయన చేయనున్నారు. అమ్మాపురం కురుమూర్తి స్వామి ఆలయంలో సిఎం రేవంత్ ప్రత్యేక పూజలు చేయనున్నారు. రూ.110 కోట్లతో ఘాట్ రోడ్డు నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయను న్నారు. ప్రస్తుతం సిఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో ఉండగా శనివారం రాత్రి హైదరాబాద్‌కు సిఎం తిరిగివచ్చారు.

# ఏం కోల్పోయారో ప్రజలకు అర్థమైంది!

- మళ్లీ అధికారం మనదే
- ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పాలకుర్తి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ నాయకులు. కార్యకర్తలతో కేసీఆర్
- పాల్గొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు.
- సినిమా ప్రొడ్యూసర్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి, సినీ ఆర్టిస్ట్ రవితేజ బిఆర్ఎస్ పార్టీలో చేరిక
- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్.
- చాలాకాలం తర్వాత కార్యకర్తల భేటీలో మాజీ సీఎం కేసీఆర్




**సిద్దిపేట, నవంబర్9 (నమస్తే ఉదయం):** బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చాలా కాలం తర్వాత కార్యకర్తలతో భేటీ అయ్యారు. ఎర్రవల్లి ఫాంహౌస్‌లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆధ్వర్యంలో తనను కలిసేందుకు వచ్చిన కార్యకర్తలతో కేసీఆర్ ముచ్చటించారు.

ఈ సందర్భంగా కేసీఆర్ ఏమన్నారంటే... అన్ని జిల్లాలో జనం చెబుతున్నారు. మళ్ళీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుంది. వచ్చే ఎన్నికల్లో 100 శాతం మనమే అధికారంలోకి వస్తాం. అందులో అనుమానమే లేదు..ప్రజలు ఏమి కోల్పోయారో వారికి అర్థం అయ్యింది.

ఇప్పటికే కొత్త ప్రభుత్వం వచ్చి 11 నెలలు గడిచిపోయాయి. అందరూ కష్టపడి పనిచేయాలి.

అధికారంలోకి రాగానే వాణ్ణి లోపల వేయాలి..విన్నీ లోపల వేయాలని మనం చూడం. ప్రభుత్వం అంటే అందర్నీ కాపాడాలి..నిర్మాణం చేయాలి..పదిమందికి లాభం చేయాలి. ప్రస్తుత ప్రభుత్వంలో ఉన్నవాళ్లు ఎలా మాట్లాడుతున్నారో మీరు చూస్తున్నారు. గత ఎన్నికల్లో మనం మ్యానిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు 10 శాతమే..కానీ 90 శాతము ఎవరు అడగకున్న పనులు చేసి చూపించాం. మిగతా.. 2లో



# మహారాష్ట్రలో రేవంత్ చెప్పేవన్నీ అబద్ధాలే

- 6 గ్యారంటీల అమలుపై తెలంగాణలో పాదయాత్ర చేసే దమ్ముందా?
- నక్సలైట్ల భావజాలమున్న వాళ్లకు విద్యా కమిషన్‌లో చోటు కల్పిస్తారా?
- కాంగ్రెసోళ్లను కూడా నక్సలైట్లు దారుణంగా చంపిన విషయం మర్చిపోయారా?
- సభ్యసమాజానికి ఏ సంకేతాలు పంపుతున్నట్లు?
- తక్షణమే విద్యా కమిషన్ ను రద్దు చేయాలి
- ప్రజాస్వామ్యవాదులారా కమిషన్ రద్దు కోసం రోడ్డెక్కండి
- జనం కష్టాల్లో ఉన్నా ఫాంహౌజ్ కే పరిమితమైనోడిని లీడర్‌గా గుర్తిస్తారా?
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ హాట్ కామెంట్స్
- కరీంనగర్‌లో కార్యకర్తలతో కలిసి 'జితేందర్ రెడ్డి' సినిమాను వీక్షించిన కేంద్ర మంత్రి
- సినిమా యూనిట్‌ను అభినందించిన బండి సంజయ్

**కరీంనగర్,నవంబర్9 (నమస్తే ఉదయం):** తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహారాష్ట్రకు పోయి పచ్చి అబద్దాలు వల్లిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ప్రజలకిచ్చిన హామీల అమలు, రుణమాఫీ, 6 గ్యారంటీలపై తెలంగాణలో ప్రజలకు మిగతా.. 2లో

# దాడికి తెగబడటమేనా ఇందిరమ్మ రాజ్యమంటే?

- ఎంఎల్ఏ కౌశిక్ రెడ్డిపై పోలీసుల దాడి తీవ్రంగా ఖండించిన కేటీఆర్

**హైదరాబాద్,నవంబర్9 (నమస్తే ఉదయం):** దళిత బంధు లబ్ధిదారులకు రెండో విడత ఆర్థిక సాయం చేయాలని అడిగితే ఎమ్మెల్యే అని కూడా చూడకుండా పోలీసులు విచక్షణరహితంగా దాడి చేస్తారా? ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే ప్రజా ప్రతినిధులపై కూడా దాడికి తెగబడటమేనా ఇందిరమ్మ రాజ్యమంటే? ఇచ్చిన హామీలు అమలు చేయటం చేతగానీ దద్దమ్మ రేవంత్ సర్కార్... అడిగిన వారిపై దాడులు చేసే సంస్కృతికి తెరలేపింది. ప్రభుత్వ పెద్దల మెప్పు పొందేందుకు పోలీసులు ఓవరాక్షన్ చేస్తే...మేము వచ్చాక తప్పకుండా మిత్తితో చెల్లిస్తాం.



కౌశిక్ రెడ్డి అంటే ఈ సీఎం రేవంత్ రెడ్డికి భయం పట్టుకుంది. ప్రభుత్వాన్ని ఎప్పటికప్పుడు నిలదీస్తున్న కౌశిక్ రెడ్డి పై రేవంత్ రెడ్డి కక్ష పెంచుకున్నాడు. మొన్న ఈ మధ్యనే బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే గాంధీతో గుండాగిరి చేయించి, కౌశిక్ రెడ్డిపై దాడి చేసే ప్రయత్నం చేశాడు. అయినా వెనక్కి తగ్గకుండా ప్రజల కోసం పోరాటం చేస్తున్న కౌశిక్ రెడ్డిపై ఈసారి పోలీసుల ద్వారానే రేవంత్ రెడ్డి దాడి చేయించాడు.

ప్రశ్నిస్తే భయపడి దాడులకు పాల్పడే ఇంత పిరికి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు.కౌశిక్ రెడ్డి పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నా. ఇలాంటి తాటాకు చప్పుళ్లకు బీఆర్ఎస్ సైనికులెవరు భయపడారు.

కౌశిక్ రెడ్డి పై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి. అదే విధంగా పోలీసులు అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలందరినీ వెంటనే విడుదల చేయాలి.



# రేవంత్ రెడ్డి బూతుల సీఎం రైతుల సీఎం కేసీఆర్

- రేవంత్ రెడ్డి తిట్లు, కేసిఆర్‌ది కిట్లు.
- ఆంధ్ర బాబుల బ్యాగులు మోసిన రేవంత్ రెడ్డికి కెసిఆర్, తెలంగాణ విలువ ఏం తెలుసు?
- రైతు బంధు వస్తది రుణమాఫీ జరుగుతది
- ఎక్కడైతే మూసిలో ఇల్లు కూలగొట్టావు అక్కడ నుంచి పాదయాత్ర చేద్దాం రా రేవంత్ రెడ్డి
- 66 ఏండ్ల కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీల పుణ్యమే మూసి కాలుష్యం.
- రాజకీయ నాయకులకు కూడా సెన్సార్ బోర్డు ఏర్పాటు చేసే పరిస్థితి వచ్చింది
- కుల్చారం రైతు ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్ రావు.

**నర్సాపూర్,నవంబర్9 (నమస్తే ఉదయం):** మీ అందరిని చూస్తే మళ్ళీ ఉద్యమ రోజులు గుర్తుకొస్తున్నాయి. మొద్దు నిద్రపోతున్న కాంగ్రెస్ పార్టీ మెడలు వంచి రైతు రుణమాఫీ చేసేందుకు ఈ రైతు దీక్షను సునీత లక్ష్మారెడ్డి ఏర్పాటు చేశారు. నెల రోజులు దాటిన రైతుల వడ్లను కొనడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది. పంట చేతికి వచ్చిన రైతుబంధు ఇవ్వలేని కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతను చూపేందుకు ఈ రైతు దీక్ష.

ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా ఎవరు అడగకపోయినా రైతుల కోసం రైతుబంధు పెట్టింది కేసీఆర్. ఎకరానికి పదివేల రూపాయలు ఇచ్చి, రైతులకు ఐదు లక్షల రూపాయల రైతు బీమా అందించిన కేసీఆర్. రైతులకు 24 గంటల ఉచిత కరెంటు ఇచ్చింది మన కేసీఆర్. రైతుల పంటను గింజ లేకుండా కొన్నది మన కేసీఆర్. రైతులకు నీటి తీరువ లేకుండా చేసింది కేసీఆర్. అందుకే కెసిఆర్ ని రైతుల సీఎం అని కొనియాడారు. మిగతా.. 2లో



# నన్ను చంపినా పర్వాలేదు కానీ దళితబంధు విడుదల చేయండి

- అంబేద్కర్ విగ్రహం వద్ద కౌశిక్‌రెడ్డి నిరసన
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

**హైదరాబాద్, నవంబర్9 (నమస్తే ఉదయం):** నా చేయి విరగొట్టినా పర్వాలేదు.. నన్ను చంపినా హుజురాబాద్ నియోజకవర్గంలోని నా దళితబిడ్డలకు రెండో విడుత దళితబంధు నిధులు విడుదల చేసే వరకు పోరాడుతూనే ఉంటాను అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు. మిగతా.. 2లో

- దేశమంతా ఒక్కటిగా ఉండడం ఇష్టం లేని కాంగ్రెస్
- ఏటిఎంలుగా మారిన కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు
- మహారాష్ట్ర ప్రచారంలో ప్రధాని మోడీ విమర్శలు




# 370 పునరుద్ధరణపై కాంగ్రెస్‌కు ఎందుకు ప్రేమ..?

**ముంబై, నవంబర్9 (నమస్తే ఉదయం):** ఆర్టికల్ 370ని రద్దు చేసినా తిరిగి పునరుద్ధరించాలని కాంగ్రెస్ పట్టుబడు తోందని..అదంటే వారికి ఎందుకు అంత ప్రేమ అని ప్రధాని నరేంద్ర మోదీ ప్రశ్నించారు. దేశమంతా ఒక్కటిగా ఉండడం వారికి ఇష్టం లేదన్నారు. అలాగే కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను ఎటిఎంలుగా మార్చు కుందని దుయ్యబట్టారు. మహారాష్ట్ర ఎన్నికలుసమీపిస్తుండడంతో ప్రధాని నరేంద్ర మోదీ విస్తృతంగా ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఇందులో భాగంగా నాందేడ్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ప్రధాని కాంగ్రెస్ పై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర ప్రజలు భాజపా, మహాయుతికూటమికి మద్దతుగా ఓట్లు వేయాలని కోరారు. మహాయుతి ప్రభుత్వం మిగతా.. 2లో

# నవంబర్ 14 నుంచి ప్రజా విజయోత్సవాలు

- నెహ్రూ జయంతి నుంచి సోనియా బర్త్‌డే వరకు ప్రజాపాలన విజయోత్సవాల నిర్వహణ
- భట్టి అధ్యక్షతన కమిటీ భేటీ



**హైదరాబాద్, నవంబర్9 (నమస్తే ఉదయం):** కాంగ్రెస్ పార్టీ ఏడాది పాలనపై నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా విజయోత్సవాలు నిర్వహించనున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. ఏడాదిగా చేసిన పనులను ప్రలజకు వివరించాలని నిర్ణయించారు. ప్రజా విజయోత్సవాలు ఏవిధంగా జరపాలి, ఏ అంశా లపై ప్రచారం చేయాలనే దానిపై విధివిధానాలు రూపొందించేందుకు భట్టి అధ్యక్షతన కేబినెట్ సబ్‌కమిటీ సమావేశమైంది. ఈ మేరకు ఉత్సవాల నిర్వహణపై శనివారం జరిగిన సబ్‌కమిటీ భేటీలో పలు నిర్ణయాలు తీసుకోవడంతోపాటు రోడ్‌మ్యాప్ సిద్ధం చేశారు. దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున ప్రజా విజయోత్సవాలు ప్రారంభించి.. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ పుట్టినరోజు వరకు నిర్వహించే విధంగా ప్రణాళిక రూపొందించింది. విజయోత్సవాల్లో భాగంగా భారీగా సాంస్కృతిక మిగతా.. 2లో

## నన్ను చంపినా పర్వాలేదు
# కానీ దళితబంధు విడుదల చేయండి

(మొదటి పేజీ తరువాయి)

హుజురాబాద్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద దళిత బంధు రెండో విడుత నిధుల కోసం దళిత సోదరులతో కలిసి పాడి కౌశిక్ రెడ్డి నిరసనకు దిగారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేసి దాడికి పాల్పడ్డారు. దీంతో కౌశిక్ రెడ్డి తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో చేరిన కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఇవాళ నా చేయి విరగ్గొట్టినా పర్వా లేదు.. నన్ను చంపినా పర్వాలేదు.. కానీ నా దళిత బిడ్డలకు మాత్రం దళితబంధు ఇవ్వకపోతే ఊరుకునే ప్రసక్తే లేదని హెచ్చరించారు. తెలంగాణలోని దళిత బిడ్డలకు కేసీఆర్ దళితబంధు ఇస్తే.. ఈ రేవంత్ రెడ్డి రూ. 12 లక్షలు ఇస్తానని చెప్పి మోసం చేశాడు. నీవు ఇచ్చిన హామీని అమలు చేయమని అడిగితే ఈ విధంగా దాడులు చేయిస్తావా..? లాఠీఛార్జ్ చేయిస్తావా..? అని రేవంత్ రెడ్డిపై కౌశిక్ రెడ్డి నిప్పులు చెరిగారు. నన్ను హత్య చేసేందుకు కుట్ర చేశారు. పోలీసుల కుట్రలను నా దళిత సోదరులు అడ్డుకున్నారు. హాస్పిటల్‌కు తీసుకెళ్లాలని దళిత సోదరులు పోలీసులతో కొట్లాడిన తర్వాత నన్ను హాస్పిటల్‌కు తీసుకొచ్చారు. దళిత సోదరులే ఇవాళ నా ప్రాణాలను కాపాడారని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి పేర్కొన్నారు.

### ఆర్థిక సాయం అడిగితే దాడి చేస్తారా? : కేటీఆర్

దళితులకు దళితబంధు ఆర్థిక సాయం అడిగితే బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై దాడి చేస్తారా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే దాడి చేయడమేనా ఇందిరమ్మ రాజ్యం అంటే..? అని ప్రశ్నించారు. ప్రభుత్వ పెద్దల మెప్పు పొందేందుకు పోలీసులు పని చేస్తున్నారు. మా ప్రభుత్వం వచ్చాక తప్పకుండా పోలీసులకు వడ్డీతో సహా చెల్లిస్తాం. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై సీఎం రేవంత్ రెడ్డి కక్ష పెంచుకున్నారు. అరికెపూడి గాంధీతో కౌశిక్ రెడ్డిపై దాడి చేసే ప్రయత్నం చేశారు. ప్రజల కోసం పోరాడుతున్న కౌశిక్ రెడ్డిపై సీఎం దాడి చేయించారు. దాడులకు పాల్పడే ఇంత పిరికి ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం.

### కౌశిక్‌రెడ్డిపై దాడిని ఖండిస్తున్నాం : హరీశ్‌రావు

హుజురాబాద్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై జరిగిన పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. దళిత బంధు లబ్ధిదారులకు రెండో విడత ఆర్థిక సహాయం చెల్లించాలని కోరడమే కౌశిక్ రెడ్డి చేసినా తప్పా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించినందుకు ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా ఇంత కర్కశంగా వ్యవహరిస్తారా? ఇది ప్రజా పాలన కాదు.. రేవంత్ మార్కు రాక్షస పాలన.. కాంగ్రెస్ మార్కు నిరంకుశ పాలన.. ఇందిరమ్మ ఎమర్జెన్సీ నాటి నిర్బంధ పాలన అని హరీశ్‌రావు ధ్వజమెత్తారు. అస్వస్థతకు గురై ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మా ఎమ్మెల్యే ఆరోగ్యం, భద్రత పట్ల పూర్తి బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదే. అరెస్ట్ చేసిన బిఆర్ఎస్ నాయకులను, కార్యకర్తలను వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# మోడీ అబద్దాల ప్రచారం ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

నమోదు అవుతున్నాయని మహాయతి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మహారాష్ట్ర అంటే శివాజీ మహారాజ్ గుర్తుకు వస్తారని అన్నారు. ఈ ఎన్నికల్లో మహా వికాస్ అఘాడీ కూటమిని గెలిపించాలని రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం అమలు కానీ హామీలు ఇచ్చిందని మోదీ అన్నారు. మహారాష్ట్ర భాజపా నేతలు తెలంగాణ ప్రభుత్వంపై ఆరోపణలు చేశారు. ప్రధాని కాంగ్రెస్ గ్యారంటీల అమలుపై అబద్దాలు చెబుతున్నారు. ఆయన అబద్దాలు చెప్పడం మానుకోకపోతే మేం నిజాలు చెబుతూనే ఉంటాం. మహారాష్ట్ర ప్రజలకు 6 గ్యారంటీల అమలుపై నిజాలు చెప్పేందుకు వచ్చా. ఇక్కడ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమాన్ని మరిచాయి. నల్ల చట్టాలు తెచ్చి అదానీ, అంబానీలకు మేలు చేయాలని మోదీ భావించారు. సామాజిక న్యాయం అందించేందుకు తెలంగాణలో కులగణన చేపట్టాం. దేశ చరిత్రలో మహారాష్ట్రకు ప్రత్యేక స్థానం ఉంది. ఇక్కడికి రావాల్సిన 17 మెగా ప్రాజెక్టులు గుజరాత్‌కు వెళ్లాయి. ఇక్కడి ప్రజలను మోసం చేసిన భాజపాను ఎన్నికల్లో ఓడించాలని రేవంత్‌రెడ్డి అన్నారు.

## 370 పునరుద్ధరణపై
# కాంగ్రెస్‌కు ఎందుకు ప్రేమ..?

(మొదటి పేజీ తరువాయి)

మాత్రమే రాష్ట్రంలో వేగవంతమైన పురోగతిని తీసుకొస్తుం దన్నారు. ప్రతిపక్షం మహా వికాస్ అఘాడీ అంటే అవినీతి, వేల కోట్ల రూపాయల కుంభకోణాలకు కేంద్రమని ఆ కూటమి అధికారంలోకి వస్తే రాష్ట్ర భవిష్యత్తు కుంటుపడుతుందని హెచ్చరించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఎన్నికల ర్యాలీల్లో ప్రదర్శించే రాజ్యాంగం అసలైనది కాదని..నకిలీదని మోదీ పేర్కొన్నారు. ఎరుపు రంగు అట్టవేసి ఉన్న ఖాళీ పేజీల పుస్తకాన్ని చూపిస్తూ..రాజ్యాంగం అని ప్రచారం చేస్తూ రాజ్యాంగాన్ని అవమానిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డా.అంబేద్కర్‌పై కాంగ్రెస్‌కు ఉన్న నిర్లక్ష్యానికి, ద్వేషానికి ఇది నిదర్శనమని మోదీ అన్నారు. అభివృద్ధి చెందిన దేశాల వరుసలో భారత్‌ను నిలబెట్టడానికి భాజపా, దాని మిత్రపక్షాలు కృషి చేస్తున్నాయని..ఇది దేశ ప్రజలకు తెలుసని అందుకే అన్ని రాష్ట్రాల ప్రజలు భాజపా, ఎన్డీఏ ప్రభుత్వాలకు మద్దతిస్తున్నారని తెలిపారు. హరియాణా ఎన్నికల్లో జరిగిందే మహారాష్ట్రలోనూ పునరావృతం అవుతుందని మోదీ పేర్కొన్నారు. తాము అధికారం లోకి వస్తే మహిళా సాధికారతే లక్ష్యంగా మరిన్ని పథకాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. 288 శాసనసభ స్థానాలు కలిగిన మహారాష్ట్రలో నవంబరు 20న ఒకేవిడతలో పోలింగ్ జరగనుంది. నవంబరు 23న ఫలితాలను ప్రకటించనున్నారు. ఏ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినా ఆ రాష్ట్రం పార్టీ 'షాహీ పరివార్'కు ఎటిఎంగా మారుతుంటుందని ప్రధాని నరేంద్ర మోడీ శనివారం ఆరోపించారు. ఈ నెల 20 నాటి మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సంబంధించి అకోలాలో ఒక ప్రచారం ర్యాలీలో ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, రాష్ట్రాన్ని కాంగ్రెస్ ఎటిఎం కానివ్వబోమని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ అంత ఎక్కువగా అవినీతికి పాల్పడుతున్నప్పుడు అధికారంలో ఉంటే ఆ పార్టీ ఎంత అవినీతిమయంగా ఉంటుందో ఎవరైనా ఊహించుకోవచ్చునని ప్రధాని అన్నారు. 'కాంగ్రెస్ ఎక్కడ ప్రభుత్వం ఏర్పాటు చేసినా ఆ రాష్ట్రం పార్టీ షాహి పరివార్‌కు ఎటిఎంగా మారిపోతుంది. మహారాష్ట్ర ఎన్నికల కోసం కర్నాటకలోని మద్యం వ్యాపారుల నుంచి రూ. 700 కోట్లు బలవంతంగా వసూలు చేశారు. తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ కూడా ఆ షాహీ పరివార్ ఎటిఎంలుగా మారాయని మోడీ ఆరోపించారు. మహాయుతి మహిళల భద్రత, ఉద్యోగావకాశాలు, లడ్కీ బహిన్ యోజన విస్తరణపై దృష్టి కేంద్రీకరిస్తుండగా, కాంగ్రెస్, శివసేన (యుబిటి), శరద్ పవార్‌కు చెందిన ఎన్‌సిపి (ఎస్‌పి)తో కూడిన మహా వికాస్ అఘాడి (ఎంవిఎ) 'అవినీతి పత్రం'తో వచ్చిందని ఆయన పేర్కొన్నారు. 'ఎంవిఎ అంటే అవినీతి, టోకెన్ డబ్బు, బదలీ నియామక వ్యాపారం అనేదని మొత్తం దేశానికి తెలుసు' అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్‌ను ప్రధాని మరింతగా తూర్పారపడుతూ, పార్టీ షాహీ పరివార్ ఎన్నడైనా బాబాసాహెబ్ అంబేద్కర్ 'పంచ్‌తీర్థ్'ను సందర్శించారా అని తాను సవాల్ చేస్తున్నానని చెప్పారు. మధ్య ప్రదేశ్‌లోని మ్హౌలోని అంబేద్కర్ జన్మస్థలం, యుకెలో ఆయన చదువుకున్నప్పుడు లండన్‌లో ఆయన బస చేసిన ప్రదేశం, నాగ్‌పూర్‌లో ఆయన బౌద్ధమతం స్వీకరించిన దీక్ష భూమి, ఢిల్లీలోని ఆయన 'మహాపరినిర్వాణ్ స్థల్', ముంబయిలోని 'చైత్య భూమి'ని ఉద్దేశించి మోడీ 'పంచ్‌తీర్థ్' పదం ప్రస్తావించారు. 'బాబాసాహెబ్ దళితుడు కనుక, రాజ్యాంగం రూపకల్పన ఘనత ఆయనకు దక్కినందున ఆయనను వారు ద్వేషిస్తారు. బాబాసాహెబ్ నాకు, బిజెపి, నా ప్రభుత్వానికి ఒక స్ఫూర్తిదాత. ఆయన వారసత్వ సంపదకు సంబంధించిన ప్రదేశాలను మా ప్రభుత్వం అభివృద్ధి చేసింది. మా యుపిఐకి భీమ్ యుపిఐ అని నామకరణం చేశాను' అని మోడీ తెలియజేశారు. కులాలు, మతాలను పరస్పరం వైరి వర్గాలుగా మార్చడం, దళితులు, వెనుకబడిన వర్గాలు సమైక్యం కాకుండా నిరోధించడం కాంగ్రెస్ గేమ్ ప్లాన్ అని, అయితే, 'ఏక్ హై తో సేఫ్ హై' అనే మంత్రాన్ని అనుసరించి హర్యానా ప్రజలు ఆ కుట్రను భగ్నం చేశారని మోడీ అన్నారు. దేశం దుర్బలంగా ఉంటేనే తాను పటిష్ఠం కాగలనని కాంగ్రెస్‌కు తెలుసు అని ఆయన పేర్కొన్నారు. గడచిన రెండు విడతలలో తన ప్రభుత్వం నాలుగు కోట్ల మందిపేద ప్రజలకు ఇళ్లు సమకూర్చగలిగిందని, మరి మూడు కోట్ల ఇళ్లు నిర్మించనున్నదని మోడీ తెలిపారు, తన మూడవ విడతలో మహారాష్ట్రలోని వాధవాన్ రేవుతో సహా అనేక లక్షల కోట్ల రూపాయల ప్రాజెక్టుల నిర్మాణం జరుగుతోందని, అది పూర్తి అయితే దేశంలోనే అతి పెద్దది అవుతుందని ప్రధాని మోడీ చెప్పారు.

# రేవంత్ రెడ్డి బూతుల సీఎం.. రైతుల సీఎం కేసీఆర్

(మొదటి పేజీ తరువాయి)

బూతుల సీఎంగా చరిత్రలో నిలిచాడు రేవంత్ రెడ్డి. కెసిఆర్ రైతుల సీఎం అయితే రేవంత్ రెడ్డి బూతుల సీఎం. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో ఆరు హామీలు అమలు చేశామని చెప్పుకుంటున్నారు. మహిళలకు 2500 రూపాయలు ఎగపెట్టింది కాంగ్రెస్ పార్టీ. 2 లక్షల రుణమాఫీ రైతులకు చేశారా?. 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు ఇచ్చారా? 4000 పెన్షన్ ఇస్తామన్నారు ఇచ్చారా?

అన్ని హామీలు ఎగపెట్టి తెలంగాణ ప్రజలను మోసం చేసిన రేవంత్ రెడ్డి, మహారాష్ట్ర ఎన్నికల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేశామని చెప్పుకోవడం దుర్మార్గం.దేవుళ్ళ మీద ఒట్టు పెట్టి రైతు రుణమాఫీ చేస్తానని మోసం చేసింది రేవంత్ రెడ్డి.

ఏడుపాయల అమ్మవారి మీద ఒట్టు పెట్టి మెదక్ చర్చి మీద ఒట్టు పెట్టి రైతులనే కాదు దేవుళ్లను కూడా మోసం చేసిన ఏకైక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. రేవంత్ రెడ్డి వచ్చినంక గ్యారెంటీకి బాండ్ పేపర్ కు విలువ లేకుండా పోయింది. కాంగ్రెస్ పార్టీ వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి గ్యారెంటీ అనే పదానికి విలువ తీసింది కాంగ్రెస్ పార్టీ.ఈ సగం రుణమాఫీ కూడా బిఆర్ఎస్ పార్టీ కొట్లాడుతూనే జరిగింది.

డిసెంబర్ 9 అన్నరు కాలేదు, పంద్రాగస్టు కు రుణమాఫీ చేస్తారని దేవుళ్ళ మీద ఒట్టు పెట్టిండు కాలేదు. నిన్న పుట్టినరోజు సందర్భంగా యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దగ్గర తప్పైన ఒప్పుకుంటాడేమో అనుకున్నా. ఆ దేవుని దగ్గరికి పోయి మళ్లీ ప్రజలను మోసం చేసే విధంగానే ప్రవర్తించాడు.

పంద్రాగస్టు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తా అని సవాలు చేసి పూర్తి రుణమాఫీ చేయకుండా పారిపోయిండు రేవంత్ రెడ్డి. వాయిదాలు మీద వాయిదాలు పెట్టి వాయిదాల ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం మారింది. హరీష్ రావు మూసి పాదయాత్ర చేయమని రేవంత్ రెడ్డి అంటున్నాడు. మూసిల ఇండ్లు కూలగొట్టింది ఎక్కడ, నువ్వు పాదయాత్ర చేసింది ఎక్కడ? ఎక్కడైతే మూసిలో ఇల్లు కూలగొట్టావు అక్కడ నుంచి పాదయాత్ర చేద్దాం రా రేవంత్ రెడ్డి.

66 ఏండ్ల కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీల పుణ్యమే మూసి కాలుష్యం. 3800 కోట్లు ఖర్చుపెట్టి మూసి పునర్జీవం ప్రారంభించారు కేసీఆర్. కాంగ్రెస్ తెలుగుదేశం పార్టీలో పుణ్యమే నల్గొండ ఫ్లోరోసిస్. ఆంధ్ర బాబుల బ్యాగులు మోసిన రేవంత్ రెడ్డికి కెసిఆర్, తెలంగాణ విలువ ఏం తెలుసు?

ఈ రాష్ట్రాన్ని ఫ్లోరైడ్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దింది కేసీఆర్.ఎక్కడైతే ఇండ్లు కూల కొట్టావో, ఎక్కడైతే ప్రజల కడుపు మంట ఉందో అక్కడ నుంచే మూసి పాదయాత్ర ప్రారంభిద్దాం. రుణమాఫీ ఎగ్గొట్టినవు, రైతుబంధు ఎగ్గొట్టినవ్, బతుకమ్మ ఎగ్గొట్టినవ్, కెసిఆర్ కిట్టె ఎగ్గొట్టినవ్, కెసిఆర్ న్యూట్రిషన్ కిట్ ఎగ్గొట్టినవ్. పిల్లి శాపనార్థాలకు ఉట్లు తెగవు. రేవంత్ రెడ్డి తిట్లకు ఈ గులాబీ జెండాలు భయపడవు.

రేవంత్ రెడ్డి తిట్లు, కేసిఆర్ ది కిట్లు. కెసిఆర్ రెండుసార్లు రైతుబంధు ఇస్తున్నాడు మూడుసార్లు రైతుబంధు చేయాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. కానీ ఇప్పుడు ఉన్న రైతుబంధు ఎగపెట్టిండు రేవంత్ రెడ్డి. మూసి మురికి కంటే రేవంత్ రెడ్డి మాటలే ఎక్కువ కంపు.. మాటలు కాదు చేతలు చేసి చూపించు రేవంత్ రెడ్డి.

సినిమాలకు సెన్సార్ బోర్డు ఏ సర్టిఫికెట్ ఇచ్చినట్టు. రేవంత్ రెడ్డి మాటలు చూస్తుంటే రాజకీయాల్లో కూడా ఏ సర్టిఫికెట్ పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాజకీయ నాయకులకు కూడా సెన్సార్ బోర్డు ఏర్పాటు చేసే పరిస్థితి వచ్చింది.

రేవంత్ రెడ్డి తెలివి ఎంత అంటే హైదరాబాద్కు మూడు దిక్కుల సముద్రం ఉందంట. బాక్రానంగల్ ప్రాజెక్ట్ తెలంగాణలో ఉందంట. దిల్ సుఖనగర్ లో విమానాల అమ్ముతరట. నోరు తెరిస్తే అబద్దాలు తప్ప ఈ ముఖ్యమంత్రి కి ఏమి రావు.

కొండా లక్ష్మణ్ బాపూజీ నల్గొండ లో పుట్టిండని రేవంత్ రెడ్డి అంటున్నాడు. కొండా లక్ష్మణ్ బాపూజీ పుట్టింది అదిలాబాదులో. ఈ ముఖ్యమంత్రి నోటికొచ్చిన అబద్ధాన్ని చెబుతూ ముఖ్యమంత్రి కూర్చి విలువ దిగజార్చుండు. తెలంగాణలో 30% వడ్లు దళారుల పాలయ్యాయి. ప్రభుత్వం ధాన్యాన్ని కొనే పరిస్థితి లేదని రైతులు దళారులకు 1700లకు అమ్ముకుంటున్నారు.

2300 మద్దతు ధర, 500 బోనస్ కలిపి 2800 రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వాలి. కానీ రేవంత్ రెడ్డి చేతగాని ప్రభుత్వం వల్ల వెయ్యి రూపాయలు రైతు నష్టపోతున్నాడు. మిగిలిన వడ్లనైనా కాంగ్రెస్ ప్రభుత్వం కొని రైతులకు సకాలంలో డబ్బులు ఇవ్వాలి. కచ్చితంగా రైతు భరోసా వానకాలం యాసంగి కలిపి 15000 రూపాయలు ఇవ్వాల్సిందే. ఇచ్చేదాకా బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షాన పోరాడుతుంది. రైతులు కాంగ్రెస్ నాయకులను ఎక్కడికక్కడ ప్రశ్నించండి. ముఖ్యమంత్రి ప్రత్యేక విమానంలో మహారాష్ట్రకు పోతే డిప్యూటీ సీఎం మరో ప్రత్యేక విమానంలో జార?ండ్ వెళ్లారట, ఇంకో మంత్రి సీతక్క కేరళకు వెళ్లారట, మరో మంత్రి శ్రీధర్ బాబు మలేషియాకి వెళ్లారట. గాలి మోటర్లు జల్సాల్ చేస్తుంటే ప్రజలేమో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం మంత్రులు గాలి మోటర్ లో తిరిగి రైతులను ప్రజలను గాలికి వదిలేశారు. కర్ణాటకలో ఐదు గ్యారంటీలు తెలంగాణలో ఆరు గ్యారెంటీలు ఇప్పుడు మహారాష్ట్రలోనూ గారడీ గ్యారంటీలు.. కాంగ్రెస్ గారడీల గ్యారెంటీల గురించి తెలిసే హర్యా నాలో కాంగ్రెస్ను ఓడించారు ఇప్పుడు మహారాష్ట్రలో కూడా అదే పరిస్థితి వస్తుంది. మహారాష్ట్రలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో రైతుల వడ్లకు 500 రూపాయల బోనస్ ఇచ్చామని చెప్తున్నారు. మనలాగే మహారాష్ట్ర ప్రజలు మోసపోవద్దంటే, మనం కూడా మహారాష్ట్రలో ఉన్న మన బంధువులకు కాంగ్రెస్ పార్టీ మోసాన్ని చెప్పాలి. కలెక్టర్ల కాళ్ళ మీద రైతులు పడే దుస్థితి వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం.

ఈనెల 14 నుంచి డిసెంబర్ 9 వరకు ప్రజా విజయోత్సవాలు జరపాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గారు అన్నారంట. రుణమాఫీ చేయనందుకు విజయ ఉత్సవమా.? రైతుబంధు ఎగ కొట్టినందుకు విజయోత్సవమా? మహిళలకు 2500 ఎగ్గొట్టినందుకు విజయ ఉత్సవమా?

ఒక్క ఇల్లు ఇవ్వకుండా ఉన్న ఇల్లు కొట్టినందుకు విజయ ఉత్సవాల? ఊర్లలో సర్వే కొచ్చినోళ్ళకు ఒకటి రాసుకోమనండి. మాకు రుణమాఫీ కాలేదని సర్వేలో రాయించండి. మాకు 4000 పెన్షన్ రాలేదని సర్వేల రాయించండి. సంవత్సరం 2000 రూపాయల పెన్షన్ ఇచ్చి అవ్వ తాతలకు 22 వేల రూపాయల పెన్షన్ బాకీపడ్డాడు రేవంత్ రెడ్డి. సంవత్సరంలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఇవ్వలేదని సర్వేలో రాయించండి. సర్వే ప్రజల కోసమే కదా ప్రభుత్వం హామీ ఇచ్చి అమలు చేయని హామీలను సర్వేలో రాయించండి. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళు తప్ప.. పోరాడితే పోయేదేమీ లేదు రైతు బంధు వస్తది రుణమాఫీ జరుగుతది. అధికారంలో అభివృద్ధి చేశాం ప్రతిపక్షంలో ప్రజల కోసం పోరాటం చేస్తున్నాం. నర్సాపూర్ చిన్న ఘనపూర్ గ్రామంలో సిద్ధ రాములు అనే కాంగ్రెస్ కార్యకర్త, నేను కాంగ్రెస్ పార్టీ అని చెప్పుకోవడానికి సిగ్గుపడుతున్న అని చెప్పాడు.

మొన్న నల్గొండలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమక్షంలో మండల పార్టీ నాయకులు ఏ ఊర్లకు పోయిన ప్రజలు నిలదీస్తున్నారని కార్యకర్తలు వాపోయారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిఆర్ఎస్ పార్టీ 100 సీట్లు గెలిచి అధికారంలోకి రాబోతుంది.

సునీత లక్ష్మారెడ్డి ఇంటి మీదనే దాడి చేశారు. బిఆర్ఎస్ కార్యకర్తలను నాయకులను అన్యాయంగా కేసులు పెట్టిన వేధించిన తస్మాత్ జాగ్రత్త. వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే.అధికారులు, పోలీసులు ఖబడ్దార్ మా కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తే వచ్చేది మా ప్రభుత్వం గుర్తించుకొండి..మా ప్రభుత్వం లో వడ్డీతో సహా చెల్లిస్తాం...

ఆంధ్రప్రదేశ్లో పోలీసులకు ఏ పరిస్థితి వచ్చిందో ఇక్కడ కూడా అదే పరిస్థితి వస్తుంది వడ్డీతో సహా చెల్లిస్తాం. గణపురం సొసైటీలో 600 మంది రైతులు ఉంటే ఒకరికి కూడా రుణమాఫీ కాలేదు. రుణమాఫీ చేస్తానన్న రేవంత్ రెడ్డి ఇప్పుడు ఏ వాగుల దునుకుతాడో చెప్పాలి. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి ఏడుపాయల అమ్మవారి దగ్గరికి వచ్చి క్షమాపణ అడిగి రైతులందరికీ రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నాం. కాలం కాలేదని చెరువుల్లో చాప పిల్లలు వదలని దద్దమ్మ ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం.

ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జయరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, ఎమ్మెల్సీలు యాదవ రెడ్డి దేశపతి శ్రీనివాస్, శేరి సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, పద్మ దేవేందర్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఢిల్లీలో మరింత అధ్వానంగా గాలిలో నాణ్యత

### పలు చోట్ల ఏక్యూఐ లెవల్స్ 400లు నమోదు

**న్యూఢిల్లీ, నవంబర్ 8(నమస్తే ఉదయం):** దేశ రాజధాని ఢిల్లీలో వరుసగా ఎనిమిదవ రోజూ గాలి నాణ్యత అధ్వానంగా మారింది. పలు చోట్ల ఏక్యూఐ లెవల్స్ 400గా నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం.. శుక్రవారం ఉదయం ఢిల్లీ ఎన్సీఆర్ ప్రాంతంలో గాలి సూచీ 383గా నమోదైంది. బవానా ప్రాంతంలో గాలి సూచీ 440గా, ముండ్కాలో 428, న్యూ మోతీ బాగ్‌లో 427, రోహిణి ప్రాంతంలో 439, పంజాబీ బాగ్‌లో 406, ఆర్‌కే పురంలో 406గా నమోదైంది. వీటితోపాటు ఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ లెవల్స్ 400 కంటే ఎక్కువగానే నమోదైంది. మరోవైపు కాలుష్యం కారణంగా ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. ఓ వైపు వాయు కాలుష్యంతో ఊపిరితీసుకోవడం ఇబ్బందికరంగా మారగా.. మరోవైపు నీటి కాలుష్యంతోనూ సతమతమవుతున్నారు. యమునా నదిలో కాలుష్య స్థాయి విపరీతంగా ఉన్నది. ఢిల్లీ-ఎన్‌సీఆర్ ప్రాంతంలో గురువారం ఉదయం 9 గంటలకు గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 367కు చేరింది. కొన్ని ప్రాంతాల్లో ఇది 400కు చేరింది. ఇటీవలే



కాలుష్యం కారణంగా శ్వాసకోశ వ్యాధులతో దవాఖానలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నదని వైద్యులు తెలిపారు. దేశ రాజధాని నగరం ఢిల్లీ, దాని పరిసర ప్రాంతాల్లో గాలి నాణ్యత తీవ్రంగా పతనమవుతుండటంతో కేంద్రం కఠిన చర్యలు ప్రారంభించింది. సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో పంట వ్యర్థాలు తగులబెట్టినవారికి విధించే జరిమానాను రెట్టింపు చేసింది. కొత్త నిబంధనల ప్రకారం, రెండు ఎకరాల కన్నా తక్కువ భూమి గల రైతులపై పర్యావరణ నష్టపరిహారం రూ.5 వేలు విధించవచ్చు. రెండెకరాల నుంచి ఐదు ఎకరాల లోపు భూమి కలవారికి రూ.10 వేలు, ఐదు ఎకరాల కన్నా ఎక్కువ భూమి కలవారికి రూ.30 వేల వరకు విధించవచ్చు. ఢిల్లీతోపాటు దేశంలోని ఇతర నగరాల్లోనూ గాలి నాణ్యత సూచీ మోడరేట్ కేటగిరీలో నమోదైంది. ముంబై లో ఏక్యూఐ లెవల్స్ 123గా, పూణెలో 114గా రికార్డయ్యాయి. రెండు నగరాల్లో శనివారం వరకు అవి 'మధ్యస్థంగా' ఉండే అవకాశం ఉన్నట్లు స్థానిక వాతావరణ కేంద్రం తెలిపింది. ఇక కోల్‌కతాలో ఏక్యూఐ 163గా కొనసాగుతోంది. అయితే, ట్రాఫిక్‌కు పేరు గాంచిన బెంగళూరు మహానగరంలో గాలి నాణ్యత సూచీ 'సంతృప్తికరమైన' కేటగిరీలో నమోదవడం విశేషం. నగరంలో శుక్రవారం ఉదయం ఏక్యూఐ 81గా ఉంది. లక్నోలో 159, పాట్నాలో 184, అహ్మదాబాద్‌లో 62గా ఏక్యూఐ లెవల్స్ నమోదయ్యాయి.

# నవంబర్ 14 నుంచి ప్రజా విజయోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ 25 రోజుల పాటు వివిధ రకాల కార్యక్రమాలతో పాటు పలు కీలక అభివృద్ధి పనులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. రాష్ట్ర ప్రభుత్వం భవిష్యత్‌లో చేపట్టబోయే కార్యక్రమాలపైనా ప్రజలకు ఈ కార్యక్రమాల ద్వారా వివరించనున్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నుంచి మొదలుపెట్టి రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయి వరకు ఈ సంబరాలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. భేటీ అనంతరం భట్టి మాట్లాడుతూ.. 'ప్రజా విజయోత్సవాల్లో భాగంగా ఉస్మానియా ఆస్పత్రి, స్పోర్ట్స్ వర్సిటీకి శంకుస్థాపన చేస్తాం. 28న పారామెడికల్, 16 నర్సింగ్ కళాశాలలను ప్రారంభిస్తాం. ఉత్సవాల్లో భాగంగా పలు కంపెనీలో ఒప్పందాలు చేసుకుంటాం. గ్రూప్-4కు ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేస్తాం.

డిసెంబర్ 9న హైదరాబాద్‌లో భారీగా ప్రజా విజయోత్సవాలు నిర్వహిస్తాం' అని తెలిపారు.

# మహారాష్ట్రలో రేవంత్ చెప్పేవన్నీ అబద్దాలే

(మొదటి పేజీ తరువాయి)

వివరిస్తూ పాదయాత్ర చేసే దమ్ముందా? అని ప్రశ్నించారు. నక్సలైట్ల భావజాలమున్న వాళ్లకు విద్యా కమిషన్ లో చోటు కల్పించి సభ్య సమాజానికి ఏ సంకేతాలు పంపుతున్నారని నిలదీశారు. ఆనాడు నక్సలైట్లను కాంగ్రెస్ నాయకులను కూడా దారుణంగా చంపిన విషయం మర్చిపోయారా? అని ప్రశ్నించారు.

కరీంనగర్ లోని మమతా థియేటర్ లో బీజేపీ కార్యకర్తలు, ఏబీవీపీ నాయకులతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ 'జితేందర్ రెడ్డి' సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా తనను కలిసిన సినిమా హీరో రాకేశ్ వర్రె, దర్శక, నిర్మాతలు, సినిమా యూనిట్ సభ్యులను అభినందించారు. అనంతరం వారితో కలిసి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. ఎవరేమన్నారంటే..

టైగర్ జితేందర్ రెడ్డి మూవీని చూసే అవకాశం కలిగింది. నేను చిన్నప్పుడు చదువుకునే సమయంలో దేశం కోసం బలిదానాలు చేసిన ఏబీవీపీ విద్యార్థుల చరిత్రను తెలుసుకున్న. వాళ్ల త్యాగాలు వృధా కాకుండా దేశం కోసం పనిచేయాలని నేను కూడా ఏబీవీపీలో పనిచేసి రాజకీయాల్లోకి వచ్చిన ంఆనాడు ఒక్క కార్యకర్త బలిదానమైతే... వందల మంది కార్యకర్తలు పుట్టుకొచ్చారు. జితేందర్ రెడ్డి బలిదానంతో వేలాది మంది పుట్టుకొచ్చారు. నక్సలైట్లు చంపుతారని తెలిసినా ఏనాడూ ఏ కార్యకర్త భయపడలేదు. నమ్మిన సిద్ధాంతం, ధర్మం కోసం పోరాడిన చరిత్ర ఏబీవీపీదే.

దేశంలో ఏ నాయకులు జాతీయ జెండా కోసం బలిదానం కాలేదు... జాతీయ జెండా కోసం బలిదానమైన వ్యక్తులు మిలటరీ సైనికులు. ఏబీవీపీ కార్యకర్తలు మాత్రమే. జితేందర్ రెడ్డి బాడీలో బుల్లెట్లు దిగిన తరువాత 'భారత్ మాతాకీ జై' నినాదం. అంత గొప్ప వ్యక్తి చరిత్రను సినిమాగా నిర్మించడం గొప్ప విషయం. జితేందర్ రెడ్డి డెడ్ బాడీని పోస్ట్ మార్టం చేస్తే రక్తం కంటే బుల్లెట్లే ఎక్కువ బయటపడ్డాయని ఆనాడు డాక్టర్లు చెప్పారంటే... అర్థం చేసుకోండి.

ఆనాడు జితేందర్ రెడ్డి, సామ జగన్ మోహన్ రెడ్డి, మధుసూదన్ గౌడ్, జయానంద్ మాదిరిగా వేలాది మంది కార్యకర్తలు ప్రాణత్యాగం చేశారు. రవీందర్ రెడ్డి చొరవ, మంచి ఆలోచనవల్ల ఇయాళ జితేందర్ రెడ్డి చరిత్రను కళ్లకు కట్టినట్లు చూపడం అదృష్టంగా భావిస్తున్నాం. అనేక కార్యకర్తలకు, ప్రజలకు స్ఫూర్తినిచ్చే సినిమా. ప్రతి ఒక్కరూ జితేందర్ రెడ్డి మాదిరిగా దేశం కోసం, ధర్మం కోసం పోరాడేందుకు సిద్ధంగా ఉన్నారు. జితేందర్ రెడ్డి స్ఫూర్తితోనే మాలాంటి ఎందరో కార్యకర్తలుగా మారి పోరాటాలు చేస్తున్నారు.

మంచి ఆలోచనలున్న ప్రతి ఒక్కరూ, దేశం కోసం, ధర్మం కోసం పనిచేస్తున్న వాళ్లంతా జితేందర్ రెడ్డి సినిమాను చూడాలని కోరుతున్నా. సినిమాలో నటించిన ప్రతి ఒక్కరికీ, టెక్నీషియన్లకు జాతీయ వాదులందరి తరపున క్రుతజతలు తెలియజేస్తున్నా.

దురదృష్టవశాత్తు కాంగ్రెస్ ప్రభుత్వం ఇయాళ మావోయిస్టు భావజాలమున్న వాళ్లకు విద్యా కమిషన్ లో చోటు కల్పించడం సిగ్గుచేటు. నక్సలైట్ భావజాలమున్న వారివల్లే ఎంతో మంది జితేందర్ రెడ్డి లాంటోళ్లు చనిపోయారు. మరి రేవంత్ రెడ్డి సర్కార్ ఏ సంకేతాలు పంపుతోంది?

నక్సలైట్ల చేతిలో కాంగ్రెస్ కార్యకర్తలు కూడా బలైపోయారు. విద్యా కమిషన్ లో నక్సలైట్ భావజాలమున్న వాళ్లను విద్యా కమిషన్ లో చోటు కల్పించడం ద్వారా వారి త్యాగాలను కూడా వృధా చేశారు. ఇది ఏ మాత్రం మంచి పద్ధతి కాదు...

జాతీయ వాదులు, ప్రజాస్వామ్యాన్ని కోరుకునే వాళ్లంతా నూతన విద్యా కమిషన్ ను రద్దు చేయాలని కోరుతున్నా. రేవంత్ సర్కార్ కూడా తక్షణమే కమిషన్ ను రద్దు చేసి కొత్త వారికి ఛైర్మన్, సభ్యులుగా అవకాశం కల్పించాలని కోరుతున్నా. అబద్దాలంటేనే కాంగ్రెస్ పార్టీ. మోసాలు, అబద్దాలకు కేరాఫ్ అడ్రస్ రేవంత్ రెడ్డి. మహారాష్ట్రకు పోయి అబద్దాలు చెప్పడం కాదా? తెలంగాణలో తిరిగి ఆ విషయాలు చెప్పే దమ్ముందా? కాంగ్రెస్ పార్టీ నిజంగా 6 గ్యారంటీలను అమలు చేసి ఉంటే.. కోట్లు ఖర్చు పెట్టి మహారాష్ట్రలో ఇచ్చిన యాడ్స్ లో ఆ విషయం ఎందుకు ప్రస్తావించలేదు?

ప్రతి ఒక్కరికీ రుణమాఫీ అమలు చేశామని చెప్పిన రేవంత్ రెడ్డి... ఇంకా 20 లక్షల మంది రైతులకు నయాపైసా రుణమాఫీ కాలేదని చెప్పే దమ్ముందా? మహిళలకు తులం బంగారం, స్కూటీ, నెలనెలా రూ.2500లు, నిరుద్యోగులకు రూ.2 లక్షల మాఫీ, విద్యార్థులకు రూ5 లక్షల భరోసా కార్డు, వృద్దులకు నెలనెలా రూ.4 వేల ఫించన్, పేదలందరికీ ఇండ్లు ఇచ్చారా?

ఇవేమీ అమలు చేయకుండా మహారాష్ట్రకు పోయి పచ్చి అబద్దాలు చెప్పడం సిగ్గు చేటు... మేం కూడా మహారాష్ట్రలో తెలంగాణలోని కాంగ్రెస్ సర్కార్ బండారాన్ని బయటపెడతాం.

6 గ్యారంటీలు, రుణమాఫీపై నిర్వహించిన సర్వేలో కాంగ్రెస్ ప్రభుత్వంపట్ల విపరీతమైన వ్యతిరేకత వచ్చింది. అందుకే నివేదికను బయటపెట్టేందుకు కూడా రేవంత్ సర్కార్ వెనుకాడుతోంది. ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, తెలంగాణలో ప్రజలను మోసం చేసి ఓట్లు దండుకున్న కాంగ్రెస్ పార్టీకి హర్యానాలో కర్రు కాల్చి వాతపెట్టారు. ఈసారి మహారాష్ట్రలో కూడా అదే జరగబోతోంది. బీజేపీపై యుద్ధం చేస్తామని రేవంత్ రెడ్డి చెప్పడం సిగ్గు చేటు.. దేనికోసం యుద్ధం చేస్తారు? ఈ దేశంలో 80 కోట్ల మందికి ఉచిత బియ్యం ఇస్తున్నందుకా? 25 కోట్ల మందిని పేదరికం నుండి బయటకు తీసుకొచ్చినందుకా? ట్రైబల్ వర్సిటీ ఇచ్చినందుకా? ట్రిబుల్ ఆర్ రోడ్డుకు నిధులు ఇస్తున్నందుకా? స్మార్ట్ సిటీ నిధులు ఇస్తున్నందుకా? గ్రామాలకు నిధులు ఇస్తున్నందుకా? జాతీయ రహదారుల కోసం రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నందుకా?

కేసీఆర్ సర్కార్ తెలంగాణలోని ఒక్కో కుటుంబంపై లక్ష రూపాయలకు పైగా అప్పు చేసి దోచుకుంటే... కాంగ్రెస్ ప్రభుత్వం అంతకు మించి అప్పులు చేస్తూ ప్రజలను బిచ్చగాళ్లను చేస్తోంది. తెలంగాణలో ప్రజలు కేసీఆర్ ను ప్రజలెప్పుడో మర్చిపోయారు. అందుకే ఫాంహౌజ్ కే పరిమితమైండు. ఎన్నికలప్పుడే బయటకొచ్చే కేసీఆర్ లాంటి నాయకుడిని తెలంగాణ సమాజం లీడర్ గా భావించదు. వరదలొస్తే బయటకు రాలే. రైతులు అరిగోస పడుతుంటే రాలే. నిరుద్యోగులు రోడ్డున పడితే రాలే.. 6 గ్యారంటీలను అమలు చేయకుండా మోసం చేస్తే రాలే.. కానీ కేటీఆర్ బామ్మర్ది రేవ్ పార్టీలో దొరికితే మాత్రం డీజీపీకి ఫోన్ చేస్తడు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ కుటుంబాన్ని ఇక ఎన్నడూ నమ్మరు. కేసీఆర్ పాలనను తలుచుకుంటేనే ప్రజల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నయ్. కాంగ్రెస్ కూడా అంతకుమించి దారుణమైన పాలన చేస్తోంది. తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీద నుండి పొయ్యి మీద పడ్డట్లయింది. ఈసారి అందుకే రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలంతా బీజేపీకి ఓటేసి గెలిపించేందుకు సిద్ధమయ్యారు. రాష్ట్రంలో ఉన్న మాజీ సర్పంచులను, ఆటో డ్రైవర్లను, రైతుల వద్దకు వెళ్లి కాంగ్రెస్ గురించి అడిగితే ఆ పార్టీ చేసిన మోసాలను చెబుతారు. ముఖ్యంగా మాజీ సర్పంచులారా... మీ గుండెపై చేయి వేసుకుని ఆలోచించండి. ఏ పార్టీకి ఓట్లేస్తే గ్రామాలకు నిధులొస్తాయి? ఏ పార్టీకి ఓట్లేస్తే మీకు న్యాయం జరుగుతుందో ఆలోచించండి. కాంగ్రెస్, బీఆర్ఎస్ మాయమాటలు నమ్మి మోసపోవద్దని కోరుతున్నా.




ఆలయాల్లో దుండగులు ధ్వంసం చేసిన విగ్రహాలు

## శంషాబాద్‌లోని మరో దేవాలయంపై
# దుండగుల దాడి

### జూకల్, కాచారం గ్రామాల్లో ఉద్రిక్తత.
### నిందితుడిని గుడిలో బంధించిన గ్రామస్తులు.

**శంషాబాద్, నవంబర్ 9(నమస్తే ఉదయం):** శంషాబాద్ మండలంలో హిందూ దేవాలయాలపై వరుసగా దాడులు జరుగుతున్నాయి. జూకల్ – కాచారం గ్రామాల మధ్యన ఉన్న అమ్మవారి దేవాలయంలో కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి అమ్మవారి విగ్రహం కనుగుడ్లను పెకిలించారు. విగ్రహానికి ఉన్న వస్త్రాలను తీసి బయట పడవేశారు. జూకల్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న ఈ విగ్రహం వద్ద జరిగిన సంఘటన గమనించిన స్థానికులు దుండగుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. ఈ విషయం చుట్టుపక్కల వ్యాపించడంతో పెద్ద సంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చారు. వారం రోజుల వ్యవధిలో శంషాబాద్ లోని మూడు దేవాలయాలపై దాడులు జరగడం తీవ్ర కలకలం సృష్టిస్తున్నది. ఈ సంఘటనతో ఈ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. శంషాబాద్ పోలీసులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చినప్పటికీ నిందితుడిని అప్పగించడానికి ప్రజలు ససేమిరా అంటున్నారు కాచారం జూకల్ గ్రామాలతో పాటు శంషాబాద్ మండలంలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు పెద్ద సంఖ్యలో తల్లి రావడంతో ఉద్రిక్తత నెలకొన్నది.

## లిమ్స్ ఆస్పత్రి ప్రథమ వార్షికోత్సవ వేడుకలు

**శంషాబాద్, నవంబర్ 9(ప్రభాత ఉదయం):** లీమ్స్ వుమెన్ అండ్ చిల్డ్రన్స్. హాస్పిటల్ ప్రథమ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ పట్టణంలోని తొండుపల్లి ఔటర్ రింగ్ రోడ్ ఎగ్జిట్. ఎంట్రీ. టోల్ గేట్ సమీపంలో ఏర్పాటు చేసిన లీమ్స్ ఆస్పత్రి బ్రాంచ్ మొదటి వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కిమ్స్




లిమ్స్ ఆస్పత్రి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న డాక్టర్లు

ఆస్పత్రి ఎండి డాక్టర్ రామరాజు. డాక్టర్ స్మిత. డాక్టర్ ప్రవీణ్ కుమార్. డాక్టర్ విశ్వనాథ్ . డాక్టర్ల బృంద ఆస్పత్రి సిబ్బంది కలిసి ప్రథమ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు.

## అయ్యప్పమాల పూజ సామాగ్రి వేలం పాట

### రూ.80వేల రూపాయలకు దక్కించుకున్న మల్లేష్ యాదవ్

**నందిగామ ,నవంబర్ 9 (నమస్తే ఉదయం):** నందిగామ మండలం అయ్యప్ప స్వామి దేవాలయంలో శనివారం గురుస్వామి శ్రీశ్రీశ్రీ గిరీష్ నాయర్ ఆధ్వర్యంలోజరిగిన అయ్యప్ప మాల పూజ సామాగ్రి వేలం పాట జరిగింది. ఈ వేలం పాటలో నరసప్పగూడ గ్రామానికి చెందిన మల్లేష్ యాదవ్ రూ.80వేలకు దక్కించుకున్నారు. ఈనెల 16వ తేదీ నుండి జనవరి 10వరకు స్వాములకు నిత్యాన్నదానం



అయ్యప్ప స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న కమిటీ సభ్యులు

జరుపుటకు కమిటీ తీర్మానించింది. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ జిల్లెల్ల బాల్ రెడ్డి, బాతుక లక్ష్మయ్య యాదవ్ , దేపల్లె అశోక్ గౌడ్, సుదర్శన్ గౌడ్, దేపల్లె కుమార్ గౌడ్, బి.జంగయ్య గౌడ్, చించేటి కృష్ణ గౌడ్, బి కృష్ణ యాదవ్, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

## కవి ,రచయిత డాక్టర్ వేము వందనం ఉత్తమ కవితగా ప్రశంసాపత్రం

**రవీంద్ర భారతి, నవంబర్ 9(నమస్తే ఉదయం):** కవి,రచయిత డాక్టర్ వేము వందనం ప్రశంసా పత్రం అందుకున్నారు. శనివారం రవీంద్ర భారతిలో జరిగిన బారత్ కల్చరల్ అకాడమీ తమ సిల్వర్ జూబిలీ వేడుకల సందర్భంగా ఆ సంస్థ, తెలుగు టెలివిజన్ రచయితల సంఘం "ప్రజాకవి కాళోజీ స్మారక జాతీయ స్థాయి కవితలపోటీలు. 2024






సంయుక్తంగా నిర్వహించింది. సమ్మేళనంలో 150"మంది కవులు,కవయిత్రులు పాల్గొన్నారు. ఈ పోటీలలో రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని భవాని కాలనీ (ప్రేమావతి పేట) కు చెందిన వ్యవసాయ విశ్వవిద్యాలయం రిటైర్డ్ ఉద్యోగి డాక్టర్ వేణు వందనం ఈ పోటీలో ఉత్తమ కవితగా ప్రశంసాపత్రం, ప్రతిభా పురష్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో అతిథులు తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ, సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు నాగబాల సురేష్ కుమార్, తెలుగు టి వి రచయితల సంఘం అధ్యక్షులు ఇనుముల ప్రేమ్ రాజ్,నిర్వహ క కార్యదర్శి షాదనాల వెంకట స్వామి నాయుడు, కాళోజీ స్మారక పురస్కార కమిటీ చైర్మన్ సి.పార్ధసారథి తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు విక్రయించుకోవాలి

### - మార్కెట్ యాడ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్

**కొత్తకోట, నవంబర్ 9(నమస్తే ఉదయం):** ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే వరి ధాన్యాన్ని రైతులు విక్రయించుకోవాలని మదనాపురం మార్కెట్ యాడ్ చైర్మన్ పల్లెపాగు ప్రశాంత్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే జిఎంఆర్ ఆదేశాల మేరకు కొత్తకోట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ వనపర్తి జిల్లా కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి తో కలిసి కొనుగోలు కేంద్రలను పరిశీలించారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న వరి కొనుగోలు కేంద్రాలను కాంటలను పరిశీలించన అనంతరం వారు



మాట్లాడుతూ... రైతులు వద్ద గింజలను ఆరబెట్టుకొని తేమ 14 శాతం ఉండేలా చూసుకొని వరిని కొనుగోలు కేంద్రాలకు తీసుకు రావాలని చెప్పారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలనిఅన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు జరుగుతాయని రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని రైతుల ప్రయోజనాల కోసం రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వరి క్వింటాలకు రూ ఐదు వందలు, బోనస్ ఇచ్చి ధాన్యాన్ని కొనుగోలు చేస్తుందన్నారు.

ఈ కార్యక్రమంలో ఏఈఓ రవీందర్ రెడ్డి, పిఎసిఎస్ సీఈవో బాలరాజు చారి, రైతు నాయకులు మోహన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సంద వెంకటేష్, జలంధర్ రెడ్డి, రాములు యాదవ్, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# నార్మ్ చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ గుత్తికొండ అనీజకు చాణక్య అవార్డు

### కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ చేతుల మీదుగా చాణక్య అవార్డు అందుకుంటున్న గుత్తికొండ అనీజ

**రాజేంద్రనగర్, నవంబరు9(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్(నార్మ్)లో చీఫ్ టెక్నికల్ ఆఫీసర్( కమ్యూనికేషన్స్)గా ప్రజా సంబంధాల అధికారిగా పనిచేస్తున్న గుత్తికొండ అనీజ ప్రతిష్టాత్మకమైన చాణక్య అవార్డు ఫర్ ఎక్సలెన్స్ ఇన్ పబ్లిక్ ఔట్రిచ్ – 2024 ను అందుకున్నారు. పబ్లిక్ రిలేషన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుంచి పదవ తేదీ వరకు జరుగుతున్న 18వ గ్లోబల్ కమ్యూనికేషన్ కాంక్లేవ్ లో గుత్తికొండ అనీజ కేంద్ర విద్యుత్ శాఖ సహాయ మంత్రి శ్రీపాద్ యశో నాయక్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. వ్యవసాయ విద్య, శిక్షణ కార్యక్రమాలలో పాల్గొంటున్న వారికి ఆ రంగంలో అవగాహన కల్పించడమే కాకుండా కమ్యూనికేషన్స్ స్కిల్స్ పెంపొందించడంలో గుత్తికొండ అనీజ చేస్తున్న కృషిని గుర్తించి ఈ అవార్డును అందజేశారు.

ప్రజా సంబంధాల అధికారిణి గా ఆమె వ్యవసాయ పరిశోధనలు, శిక్షణ, విద్యా కార్యక్రమాలను ఆయా రంగాల



ప్రజలకు చేరవేయడానికి చేస్తున్న కృషికి గాను ఈ అవార్డు ను ఇవ్వడం జరిగింది. నార్మ్ లో వ్యవసాయ డిగ్రీ తో పాటు వివిధ కోర్సులలో పాల్గొన్న 18 వేల మంది విద్యార్థులకు గుత్తికొండ అనీజ కమ్యూనికేషన్ స్కిల్స్, వ్యవసాయ కోర్సులపై అవగాహన, అవకాశాల గురించి వివరించి ప్రోత్సాహాన్ని అందజేశారు . గుత్తికొండ అనీజ పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా – హైదరాబాద్ చాప్టర్‌కు ప్రధాన కార్యదర్శిగా కూడా పని చేశారు.

ఆమె మంచి క్రీడాకారిణి కూడా జాతీయస్థాయిలో చాణక్య అవార్డు అందుకున్న గుత్తికొండ అనీజ ను సహచర ఉద్యోగులు, పాత్రికేయులు, ఎలక్ట్రాన్ మీడియా ప్రతిధులు, కుటుంబ సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా గుత్తికొండ అనీజ మాట్లాడుతూ, తనకు జాతీయస్థాయిలో చాణక్య అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. ఇది తనకు మరింత బాధ్యతను పెంచిందని గుర్తు చేశారు. తనకు విధి నిర్వహణలో ప్రోత్సాహాన్ని అందిస్తూ సహకరించిన నార్మ్ డైరెక్టర్ డా. సీహెచ్ శ్రీనివాస్ రావు, మాజీ డైరెక్టర్లు డాక్టర్ డి.రామారావు, డాక్టర్ ఆర్ కె సమంత, డాక్టర్ జగదీష్ సి కల్ల, డాక్టర్ ఎన్ హెచ్ రావు, డాక్టర్ ఎస్ ఎన్ సహా, డాక్టర్ జె సి కత్యాల్ తో పాటు సిబ్బంది అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఇంటింటి సర్వేలో ప్రజల వివరాలు సంపూర్ణంగా ఉండాలి:మంత్రి భట్టి విక్రమార్క

### ఎన్యూమరేటర్లు పకడ్బందీగా నమోదులు చేయాలి

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 9(నమస్తే ఉదయం):** హౌస్ లిస్టింగ్ పూర్తిచేసుకుని నేటి నుంచి ఇంటింటి సర్వే ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఎన్యూమరేటర్లు పకడ్బందీగా నమోదులు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు తెలిపారు.శనివారం నుండి ప్రారంభమైన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర సర్వే ఇంటింటి కుటుంబ సర్వేపై సీఎస్ శాంతికుమారి, ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలతో కలిసి జిల్లా కలెక్టర్లుతో అయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. శనివారం నుంచి ఇంటింటి సర్వే ప్రారంభ మవుతున్న నేపథ్యంలో ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటా యని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని పేర్కొన్నారు. ప్రజలు ఎలాంటి అపోహలు పడకుండా ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వే ప్రక్రియలో ప్రజల పట్ల ఎన్యూమరేటర్లు భాద్యతగా వ్యవహరించాలని సూచించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సర్వేలో




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి భట్టి విక్రమార్క

భాగస్వాములు అయ్యేల ఆహ్వానించాలని తెలిపారు. సమగ్ర కుటుంబ సర్వే చాలా మంచి కార్యక్రమమని ప్రజల సమగ్ర సమాచారం సేకరణ వల్ల అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడానికి దోహదపడతాయని తెలిపారు.

హౌస్ లిస్టింగ్ సర్వే దిగ్విజయంగా నిర్వహించారని, అదే ఉత్సాహంతో సర్వే కూడా పూర్తి అయ్యే వరకు పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సర్వే సమాచారం గ్రామ స్థాయిలోని చిట్ట చివరి ఇంటికి చేరే విధంగా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, గ్రామాలు, పట్టణాల ప్రధాన కూడళ్ళలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులతో మాట్లాడుతూ, సర్వే కొరకు జారీ చేసిన బుక్‌లెట్‌లో మొత్తం 56 అంశాలు న్నాయని ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుండి ఖచ్చితమైన సమాచారం సేకరణతో నమోదులు చేయాలని సూచించారు. సర్వే ప్రక్రియను సూపర్ వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సర్వే ప్రక్రియను నిబద్ధతతో నిష్పక్షపాతంగా ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని అన్నారు. ప్రజలు సర్వే సిబ్బందికి సహకరించి సమగ్ర సమాచారం ఇవ్వాలని సూచించారు.


సర్వేకు ఒక రోజు ముందు గ్రామాలు, పట్టణంలో విస్తృత ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రజల నుండి సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందని, ఎలాంటి అపోహలు లేకుండా ప్రజలు ఖచ్చిత సమాచారం ఇవ్వాలని సూచించారు. సర్వేపై ప్రజలు ఎలాంటి దుష్ప్రచారాలు నమ్మొద్దని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగ్ రావు, జడ్పీ సీఈవో కాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా కేంద్రంలో చైన్ స్నాచింగ్

### మహిళ మెడలో గొలుసు లాక్కెళ్ళిన చైన్ స్నాచర్స్
### జిల్లా కేంద్రంలోనీ పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలో ఘటన

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 9 (నమస్తే ఉదయం):** జిల్లా కేంద్రంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో నివాస ముంటున్న ఓ మహిళ మెడలో బంగారు గొలుసును దుండగులు అపహరించుకెళ్లారు. బాధితురాలు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.... పాత హౌసింగ్ బోర్డు కాలనీలో శోభమ్మ నివాసం ఉంటుంది. అయితే శోభమ్మ కార్తీక మాసం కావడంతో శనివారం ఉదయం తన ఇంటి సమీపంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయానికి వెళ్లి పూజలు చేసి తిరిగి వస్తుండగా తన ఇంటి వద్ద ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై అక్కడకు చేరుకున్నారు. వీరిలో ఒకరు కిందకు దిగి ఆమె మెడలోని 3.5 తులాల బంగారు గొలుసును లాక్కొని ద్విచక్ర వాహనంపై ఉడాయించారు.

కాగ మహిళపై దాడి చేసి ఈ ఘాతకానికి పాల్పడటంతో ఆమె భయాందోళనకు గురైంది. ఆ మహిళ కేకలతో చుట్టపక్కల వారు అక్కడకు చేరుకునే లోపు దుండగులు కంటికి కనిపించకుండా పోయారు. ఘటనపై బాధితురాలు గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్



లో ఫిర్యాదు చేసింది. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ ప్రదేశంలోని సీసీకెమెరాల ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేస్తున్నారు.

# వైభవంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

**కొత్తకోట, నవంబర్ 9 (నమస్తే ఉదయం):** కొత్తకోట పట్టణ సమీపంలో వెంకటగిరి క్షేత్రం లో వెలిసిన శ్రీ భూలక్ష్మి వెంకటేశ్వర స్వామి కళ్యాణం వైభవంగా జరిగింది. పూజల అనంతరం అమ్మవారికి మంత్రోచ్చరణల మధ్య మేళ తాళాలతో స్వామివారి కళ్యాణం కార్తీక మాసంలోని రెండో శనివారం రోజున అంగరంగ వైభవంగా జరిగింది.

శోభయమానంగా అలంకరించి కళ్యాణ మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళ్యాణోత్సవంలో జిలకర బెల్లం తదితర పూజలు అనంతరం అమ్మవారికి మంగళసూత్ర ధారణ జరిపించారు. స్వామి వారి జన్మ నక్షత్రం శ్రావణ నక్షత్రం రోజున వెంకటేశ్వర స్వామి ఉత్సవమూర్తి విగ్రహాలను ఆలయం అర్చకులు పట్టు వస్త్రాలతో అలంకరణ చేసి కళ్యాణ మండపంలో అర్చకుల పేద మంత్రాలతో కళ్యాణం వైభవంగా నిర్వహించారు. సింగరా



పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉత్సవ మూర్తులను ఉరేగిస్తున్న భక్తులు

ఆచార్యులు, కిట్టు స్వామి, అమిత్ స్వాములు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు.ఆలయ గర్భగుడి నుండి ఉత్సవ మూర్తి విగ్రహాలని కళ్యాణ మండపం వద్దకు తీసుకువచ్చి కళ్యాణం



నిర్వహించిన తర్వాత పల్లకిలో కూర్చోబెట్టి పూజలు చేసి వెంకటేశ్వర స్వామి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి భక్తులు పల్లకి సేవతో గోవింద నామస్మరణల మధ్య భుజాలపై పల్లకిని మోస్తూ ఆలయం చుట్టూ భక్తులు పెద్ద సంఖ్యలో ప్రదక్షిణలు చేస్తూ పల్లకి సేవలు వైభవంగా నిర్వహిం చారు. కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు వివిధ గ్రామాల నుండి భక్తులు పాల్గొన్నారు. కళ్యాణ్ ఉత్సవంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.

ఈ కళ్యాణ కార్యక్రమంలో గొల్ల బాబు, వేముల శ్రీనివాస్ రెడ్డి, మద్దిగట్ల శ్రీనివాస్ రెడ్డి, ఆర్ సురేందర్ రెడ్డి, బలిజేపల్లి శ్రీనివాసులు శెట్టి, సుదర్శన్ శెట్టి, గంగు బాల్ రెడ్డి,సతీష్ కుమార్, చెల్లిమిళ్ళ రంగారెడ్డి,సంబరి శ్రీనివాసులు, ఏం చంద్రశేఖర్ రెడ్డి, కొన్నూర్ నారాయణరెడ్డి, అప్పరాల నాగార్జున రెడ్డి, వెంకట్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద మంచినీటి ట్యాంకు నిర్మాణం కోసం భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## శ్రీ కురుమూర్తి స్వామి భక్తులకు ఇబ్బందులు లేకుండా మంచినీటి సరఫరా: ఎమ్మెల్యే జీఎంఆర్

**దేవరకద్ర (చిన్న చింతకుంట), నవంబర్ 9(నమస్తే ఉదయం):** శ్రీ కురుమూర్తి స్వామి జాతరకు వచ్చే భక్తులకు మంచినీటి ని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.
శనివారం శ్రీ.శ్రీ.శ్రీ. కురుమూర్తి దేవస్థానం వద్ద శాశ్వత మంచి నీటి పరిష్కారం కోసం మిషన్ భగీరథ 200 కె.ఎల్ సంపు నిర్మాణానికి ఎమ్మెల్యే జిఎంఆర్ భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్, ఈవో, పాలక మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అయిజ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏబీవీపీ కార్యదర్శిగా శ్రీధర్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 9(నమస్తే ఉదయం):** జోగులాంబ గద్వాల జిల్లా అయిజ కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ



ఐజ ఏబీవీపీ నూతన కార్యవర్గం


కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెంకటేష్ పాల్గొని నూతన కమిటీని ప్రకటించారు. అయిజ పట్టణ కేంద్రంలో ఉన్న అరోరా కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న శ్రీధర్ రెడ్డిని పట్టణ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. ఐజ పట్టణంలో ఉన్న విద్యారంగ సమస్యలు, విద్యార్థుల భవిష్యత్తు కోసం సమాజం కోసం ఏబీవీపీ ఎప్పుడు నిరంతరంగా ఉద్యమాలు చేస్తుందన్నారు.
విద్యారంగ సమస్యలు ఎక్కడ ఉన్నా అక్కడ విద్యార్థుల పక్షాన ఉండి ఏబీవీపీ నిరంతరంగా ఉద్యమాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అయిజ నగర ఏబీవీపీ కమిటీ సభ్యులు లోకేష్,సి నరేష్ ,టి నరేష్, నిఖిల్, షేక్షావలి, శ్రీహరి, శ్రీనాథ్, వినీత్, ఉదయ్, రాఘవేంద్ర, విజయ్, అశోక్, వంశీ, బలరాం, సద్దాం, రహీం, నాని, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యుమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా సర్వే చేయాలి

### - జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్9(నమస్తే ఉదయం):** ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉపాధి, కుల వివరాల సేకరణకై నిర్వహిస్తున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు ఎలాంటి తప్పులు లేకుండా సర్వే



చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఆదేశించారు. శనివారం ఇటిక్యాల మండలం పెద్దదిన్నె గ్రామంలోని తొమ్మిదో వార్డులో నిర్వహిస్తున్న సర్వేను కలెక్టర్ తనిఖీ చేశారు. అంగన్వాడి టీచర్ నారాయణమ్మ సర్వే నిర్వహిస్తున్న ఇంటిని పరిశీలించి సర్వేను తెలుసుకున్నారు. ఇంటి యజమానితో పాటు కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసి పొందుపరిచిన కోడ్ నెంబర్లను వేయాలన్నారు.
ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పార్ట్ -1లో యజమాని వివరాలతో పాటు పార్ట్ -2లో కుటుంబ సభ్యుల పూర్తి వివరాలు వార్షిక ఆదాయం తదితర వివరాలను పొందుపరచాలన్నారు. ఈ సందర్భంగా ఏన్యుమరేటర్‌కు పలు సూచనలు చేశారు.
ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఓ శ్యాంసుందర్, తాసిల్దార్ నరేందర్, ఎంపీడీవో ఎండి అజర్ మొహియుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# సందర్శకులను ఆహ్లాద పరుస్తున్న శిల్పారామం

### ఉట్టి పడుతున్న గ్రామీణ వాతావరణం

**రాజేంద్రనగర్, నవంబరు 9(నమస్తే ఉదయం):** నగరంలోని శిల్పారామం సందర్శకులను ఎంతగానో అహ్లాద ఫరుస్తుంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8 :30 గంటల వరకు శిల్పారామం సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. ఇక్కడ వివిధ రకాల వస్తువులతో పాటు ఆహ్లాద పరిచే పార్కులు, చక్కటి వాతావరణం, అందమైన పాల్కులు, గ్రామీణ వాతావరణం ఉట్టి పడే విధంగా ఇక్కడ పరిస్థితులు కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయి. నిత్యం బిజీగా ఉండే నగర ప్రజలు సాయంత్రం వేళల్లో సేద తీరడానికి శిల్పారామం పార్కు ఎంతగానో దోహద పడుతుందని పలువురి అభిప్రాయం.



**గోరింటాకు పెట్టేవారితో స్వాగతం :**

రూ. 60తో టికెట్ తీసుకుని శిల్పారామంలోకి వెళ్ళగానే గోరింటాకు పెట్టేవారు స్వాగతం పలుకుతారు. రూ. 50ల నుంచి మనం ఎంచుకున్న డిజైన్ ను బట్టి గోరింటాకు కు డబ్బులు వసూలు చేస్తారు. అక్కడి నుంచి కొద్దిగా లోపలికి వెళ్ళగానే వివిధ రాష్ట్రాలకు చెందిన వస్త్రాలు, గృహోపకరణాలు, వివిధ రకాల వస్తువులు అందుబాటులో ఉంటాయి. అన్ని రకాల మట్టి పాత్రలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి.

**గ్రామీణ వాతావరణం ఉట్టిపడేలా కుటీరాలు:** కొండలను అదేవిధంగా ఉంచి కుటీరాలను నిర్మించారు. అంద మైన శిల్పాలను చెక్కారు. పార్కులను, వాటర్ ఫౌంటైన్లను అభివృద్ధి చేశారు.

**కళ్లకు కట్టినట్లుగా గ్రామీణ వాతావరణం :**

శిల్పారామం లో గిరిజన ప్రజల జీవన విధానం, గ్రామీణ ప్రజల జీవన విధానాలను కళ్ళకు కట్టినట్లు కనిపించే విధంగా ఏర్పాటు చేశారు.

# సభ్యత్వ నమోదులో గద్వాల్ అగ్రస్థానంలో నిలవాలి

### - గద్వాల్ సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 9(నమస్తే ఉదయం):** జోగులాంబ గద్వాల్ జిల్లా బిజెపి సంస్థాగత ఎన్నికల వర్క్‌షాప్ లో పార్టీ శ్రేణులు అంకితభావంతో పనిచేసి సభ్యత్వ నమోదులో అగ్రస్థానంలో నిలవాలని గద్వాల జిల్లా బిజెపి సభ్యత్వ నమోదు ఇంచార్జ్ బొక్క బాల్ రెడ్డి అన్నారు. శనివారం గద్వాల పట్టణ కేంద్రంలో పార్టీ శ్రేణులతో ఏర్పాటు చేసిన సభ్యత్వం నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా బొక్క బాల్ రెడ్డి మాట్లాడుతూ...
భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు లో



పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రసంగిస్తున్న నమోదు కార్యక్రమం ఇన్చార్జ్ బొక్క బాల్ రెడ్డి

గద్వాల్ జిల్లా అగ్రస్థానం లో నిలబెట్టేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు,బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణమ్మ ప్రోత్సాహం,జోగులాంబ గద్వాల్ జిల్లా బీజేపీ జనరల్ సెక్రటరీ డీకే స్నిగ్ధ కృషి ఫలితంగా జిల్లా లో బీజేపీ సభ్యత్వ నమోదు జోరుగా జరగడం చాలా సంతోషకరమన్నారు. పార్టీలో క్రియాశీలకంగా ఉన్న బాధ్యుడు 200 మంది సభ్యులని బిజెపిలో నమోదు చేయిస్తే, మండల, జిల్లా స్థాయిలో నాయకులుగా తయారు అయ్యే అవకాశం ఉంటుందన్నారు. త్వరలో బీజేపీ సంస్థాగత ఎన్నికలు వస్తున్న తరుణం లో జిల్లా కార్యకర్తలు,నాయకులు,మరింత ఉత్సాహంతో పని చేసి,ఎక్కువ మంది ప్రజలకి బీజేపీ పథకాలని, ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వాన్ని చేరువ చేయాలన్నారు.
ఈ కార్యక్రమంలో జోగులాంబ గద్వాల్ జిల్లా బిజెపి అధ్యక్షులు రామచంద్ర రెడ్డి,జిల్లా మోర్చా అధ్యక్షులు,సోషల్ మీడియా అధ్యక్షులు, విద్యాసాగర్ రెడ్డి బిజెపి ఎలక్షన్ ఇంచార్జ రామాంజనేయులు, శివారెడ్డి ,రామచందర్ రెడ్డి, దేవదాస్ ,కేకే రెడ్డి, రాజశేఖర్ , నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేలు అమలు చేయాలి

### - మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి

**ఎల్బీనగర్, నవంబర్ 9(నమస్తే ఉదయం):** మున్సిపల్ కార్మికులకు కనీస వేతనాలు 26 వేలు అమలు చేయాలని మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఎల్బీనగర్ జోన్ పరిధిలోని జిల్లా నాయకులు ఎం మద్దిలేటి ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల సమావేశం నాగోల్ ఏఐటీయూసీ డాంగే భవన్‌లో జరిగింది. ఈ సమావేశానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ & ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ.... మున్సిపల్లో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ , ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలన్నారు. భారతదేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని తీర్పు ఇచ్చినా ఏ రాష్ట్రాలలో అమలు చేయడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కార్మికుల అందరిని పర్మినెంట్ చేసేంతవరకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు కూడ పెంచాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు క్యాజువల్ లీవ్ లు అమలు చేయాలన్నారు. అదేవిధంగా జాతీయ పండుగ సెలవుల్ని ఇవ్వాలన్నారు. పారిశుద్ధ్యం పనులు చేస్తున్న కార్మికులని చిన్న చూపు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో






కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న జైపాల్ రెడ్డి, సమావేశంలో పాల్గొన్న కార్మికులు

మంత్రులు , ఎమ్మెల్యేలు ప్రజాప్రతినిధిలు, అధికారులు వస్తున్నారంటే ముందుగా మున్సిపల్ కార్మికుల చేత అని పనులు చేయిస్తారన్నారు. అలాంటి కార్మికులకు కనీస వేతనాలు అమ్మలు చేయకపోవడం మరి దారుణమన్నారు. కార్మికులు విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదం జరిగి మరణిస్తే 25 లక్షలు , దహన సంస్కారాల ఖర్చు 30 వేల రూపాయలు ఇవ్వాలన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఏఐటీయూసీ మున్సిపల్ సంఘం ఆధ్వర్యంలో డిసెంబర్ నెలలో పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు.
ఎల్బీనగర్ జోన్ మున్సిపల్ సంఘం రాష్ట్ర కార్యదర్శి జైపాల్ రెడ్డి 27 మందితో కౌన్సిల్ సభ్యులను ప్రతిపాదించడం జరిగింది. కార్మికులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా జె.యాదమ్మ , కార్యనిర్వాక అధ్యక్షులుగా హంసమ్మ, ఉపాధ్యక్షరాలుగా వెంకటమ్మ, అంజయ్య, నందు, ప్రధాన కార్యదర్శి: ఎం.మద్దిలేటి, సహాయ కార్యదర్శిలుగా లక్ష్మమ్మ, కృష్ణవేణి, నరసమ్మ , కోశాధికారి లక్ష్మి, కౌన్సిల్ సభ్యులు: సిహెచ్.పద్మ , అండాలు, విజయమ్మ, సుమత, లావణ్య, యాదమ్మ, రవి, రాజు, లలిత, సుజాత, కల్పన, మరో ఆరు మందిని కో ఆప్షన్ సభ్యులుగా ఎన్నుకొన్నారు.

# బస్‌స్టాప్‌లో ఏడుస్తూ కూర్చున్న యువతిని చేరదీసి తల్లిదండ్రులకు అప్పగించిన ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రమీల

**రాజేంద్రనగర్, నవంబరు 9 (నమస్తే ఉదయం):** ఇంట్లో అలిగి బయటికి వచ్చేసిన ఓ యువతిని గమనించి చేరదీసి ఆమె తల్లి దండ్రులకు అప్పగించిన సంఘటన ఇది. ఎవ్వరేమైతే మన కెందుకులే అని ఆలోచించే నేటి సమాజంలో ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రమీల మంచి మనసుతో ఆలోచించి ఆ యువతి యోగక్షేమాలు తెలుసుకొని వారి కుటుంబ సభ్యులకు అప్పగించడం సంతోషకరం.
వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నార్సింగ్ కు చెందిన అనూష (20), వెంకట రాములు భార్యాభర్తలు. వెంకట రాములు అక్క మల్లమ్మ కూతురైన అనూషను సంవత్సరం క్రితం వివాహం చేసుకున్నాడు. వాళ్ళింట్లో చిన్న చిన్న గొడవలు జరగగా పక్కనే నివాసం ఉండే తల్లి మల్లమ్మ శుక్రవారం కూతురు అనూష ను పిలిపించి నీవు కూడా ఏదైనా పని చేసి కుటుంబానికి అండగా ఉండాలని సర్ది చెప్పింది. అది నచ్చని అనూష శనివారం ఉదయం నిద్ర లేవగానే ఆధార్ కార్డు తీసుకుని నార్సింగ్ లో బస్సు ఎక్కి అరాంఘర్ చౌరస్తాలో దిగింది. అక్కడి నుంచి ఎటు



ఇంట్లో అలిగి బయటికి వచ్చిన అనూషను తల్లిదండ్రులకు అప్పగించిన ట్రాఫిక్ పోలీసులు

పోవాలో తెలియక ఏడుస్తూ కూర్చుంది. ఉదయం 8 గంటలకు డ్యూటీ కి వచ్చినా ట్రాఫిక్ ఏఎస్ఐ ప్రమీల ఆ యువతిని చూసి వివరాలు అడిగి తెలుసుకుంది. ఇంట్లో గొడవపడి వచ్చేసాను అని చెప్పడంతో పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి తాను తీసుకువచ్చిన టిఫిన్ బాక్సులోని అన్నం వడ్డించింది. అనంతరం వివరాలు తెలుసుకొని తల్లిదండ్రులకు సమాచారం అందించింది.
తల్లి మల్లమ్మ, తండ్రి నరసింహులు రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారు ఆర్ఐ గణేష్ కుమార్‌తో కలిసి ఏఎస్ఐ ప్రమీల, కానిస్టేబుల్ చిరంజీవిలు ఆ యువతిని తల్లిదండ్రులకు అప్పగించారు.

**కృతజ్ఞతలు తెలిపిన మల్లమ్మ, నరసింహులు దంపతులు:**

ఇంట్లో గొడవపడి బయటికి వచ్చిన తన కూతురు అనూష ను చేరదీసి అన్నం పెట్టి తమకు సమాచారం అందించి అప్పగించిన రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీసులకు మల్లమ్మ, నరసింహులు కృతజ్ఞతలు తెలిపారు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733



## చట్టాలపై ప్రతి బాలిక అవగాహన
# పెంపొందించుకోవాలి

**- సివిల్ జడ్జి టి.లక్ష్మి**

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 9(నమస్తే ఉదయం):** చట్టాలపై ప్రతి బాలిక అవగాహన పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి టి.లక్ష్మి అన్నారు. శనివారం గద్వాల పట్టణంలోని రెండవ రైల్వే గేట్ సమీపంలోని తెలంగాణ మైనారిటి రెసిడెన్షియల్ బాలికల కళాశాలను న్యాయమూర్తి సందర్శించారు. ఈ కార్యక్రమంలో లీగల్ అవేర్నెస్ ప్రోగ్రామ్ వారు చక్కగా బాలికలకు చట్టాల గురించి అవగాహన నిర్వహించారు. విద్య, వైద్యము బాలికలకు ఎంత అవసరమో విద్య యొక్క ఆవశ్యకతను బాలికలకు తెలియజెప్పారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ...ఇంటర్ విద్యార్థినిలు చక్కగా చదివి కళాశాలకు తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. మానవ జీవితంలో ఎవరైనా తప్పులు చేయవచ్చు కానీ దానిని సరిదిద్దుకొని ముందుకు వెళ్లాలన్నారు. కళాశాల విద్యార్థినులకు ఏదైనా సమస్య ఉంటే కోర్టులో లీగల్ పుస్తకము ఏర్పాటు చేస్తామని అందులో సమస్య నమోదు చేస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలను మంచిగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రాజేందర్, ఇక్బాల్, ప్రిన్సిపాల్ పార్వతి తదితరులు పాల్గొన్నారు.

## కుల గణన సర్వేకు
# ప్రజలు సహకరించాలి

**- జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు**

**రాజేంద్రనగర్, నవంబర్ 9(నమస్తే ఉదయం):** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కుల గణన సర్వే కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్రావు అన్నారు. శనివారం ఇంటింటికి సర్వే పర్యవేక్షణలో భాగంగా జిల్లా



ఇంటింటి సర్వే పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు

విద్యాశాఖ అధికారి సుశీందర్ రావు , మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ , సూపర్ వైజర్ స్వరూప రాణి పాల్గొని ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిఇఓ సుసింధర్ రావు మాట్లాడుతూ... ప్రజలు కులగణనలో సిబ్బందికి సరియైన సమాచారం ఇవ్వాలన్నారు. ప్రభుత్వ పథకాల సద్వినియోగం.. పరిపాలన ,ప్రజల స్థితిగతులపై ప్రాథమిక వివరాల్ని అందరూ ఇవ్వాలన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దమయంతి, చంద్రశేఖర్, సుమలత, శ్రీనివాస్, సౌమ్య శ్రీ పాల్గొన్నారు.

## 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు
# ఓటరుగా నమోదు చేసుకోవాలి

**- కలెక్టర్ సంతోష్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 9(నమస్తే ఉదయం):** జనవరి ఒకటి 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ బి ఎం



ఓటర్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

సంతోష్ అన్నారు. శనివారం ఇటిక్యాల మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఫారం 6 ద్వారా ఓటర్ నమోదు, ఫారం 7 ద్వారా అభ్యంతరాలు, ఫారం 8 ద్వారా అడ్రస్ మార్పు ల గురించి బిఎల్ఓ ను అడిగి ఎన్ని నమోదు అయ్యాయని తెలుసుకున్నారు. ఓటరుగా నమోదు చేసుకోవడానికి మరో అవకాశం ఉందని ఓటరు జాబితాలో తమ పేరు ఉందో లేదో ఓటరు చెక్ చేసుకుని బి ఎల్ ఓ దగ్గర ఓటరుగా పేరు లేకుంటే నమోదు చేసుకోవాలన్నారు. ఫారం 6, 7, 8 బిఎల్ఓ దగ్గర అందుబాటులో ఉంటాయని తెలిపారు. 18 సంవత్సరాల నిండిన వారు రెండు కలర్ పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, నివాస, వయస్సు, ధ్రువీకరణ పత్రం తీసుకొని రావాలన్నారు.

ఈ సందర్భంగా పాఠశాలలోని పోలింగ్ స్టేషన్లు 27, 28, 29 పరిశీలించి మరుగుదొడ్డి ర్యాంపులు తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. ఒకటి జనవరి 2025 నాటికి 18 సంవత్సరాల నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డిపిఓ శ్యాంసుందర్, తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో ఎండి అజర్ మొయుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.





శాస్త్రిపురం రోడ్డులో ఫుట్పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది, ఫుట్పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ సిబ్బంది

## రోడ్ల ఆక్రమణపై నిర్మాణాలు
# తొలగిస్తాం: జోనల్ కమిషనర్ వెంకన్న

**శాస్త్రిపురం రోడ్డులో 208 ఆక్రమణలను తొలగించిన రాజేంద్రనగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు**

**రాజేంద్రనగర్, నవంబరు 9(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ శాస్త్రి పురం రోడ్డు ను ఆక్రమించి వెలిసిన 208 షెడ్లు, డబ్బాలను శనివారం టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు తొలగించారు.

60 ఫీట్లుగా ఉన్న ఈ రోడ్డును కొన్ని చోట్ల 30 ఫీట్లకు వచ్చేలా షెడ్లు వేశారు. దీంతో ఏ రోడ్డు లో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కె .రవికుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీధర్ పర్యవేక్షణలో చైన్ మెన్ లు రమేష్, కరణ్ లు ఈ కూల్చివేతలలో పాల్గొన్నారు.

### ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగిస్తాం : ఏసీపీ శ్రీధర్

మధువన్ కాలనీ లో వెలిసిన రోడ్డు అక్రమణ లను ముందుగా తొలగించాం. శనివారం శాస్త్రీపురం కాలనీలో ఫుట్ పాత్ ఆక్రమణలు తొలగించాం. భవిష్యత్తులో రాజేంద్రనగర్ సర్కిల్లో ఉన్న ఫుట్ పాత్ ఆక్రమణలను తొలగిస్తామన్నారు.

## సమగ్ర కుటుంబ సర్వేలో ప్రతి ఒక్కరు
## తమ వివరాలను తెలియచేయండి : జోనల్ కమిషనర్ వెంకన్న

**రాజేంద్రనగర్, నవంబరు 9(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్లో సమగ్ర కుటుంబ సర్వే వివరాలు ప్రతి ఒక్కరు తెలియచేయాలని గ్రేటర్ దక్షిణ మండలం జోనల్ కమిషనర్ టి వెంకన్న కోరారు.

శనివారం గణేష్ నగర్, ప్రేమావతి పేట్ బస్తీలలో డిప్యూటీ కమిషనర్ కె .రవికుమార్తో కలిసి సమగ్ర కుటుంబ సర్వే సందర్భంగా ఇంటింటికి వేస్తున్న స్టిక్కర్లను పరిశీలించారు. ప్రభుత్వ ఉద్దేశాన్ని ప్రజలకు వివరించి వారి వివరాలు తీసుకోవాలన్నారు.



# హైదర్ గూడ పోచమ్మ ఆలయంలో మురికి నీరు రాకుండా మరమ్మతులు చేపట్టాలి

**రాజేంద్రనగర్, నవంబర్ 9(నమస్తే ఉదయం):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని హైదర్ గూడశ్రీ శ్రీ పోచమ్మ దేవాలయం లోకి మురికినీరు చేరకుండా మరమ్మతులు చేపట్టాలని ఆలయ కమిటీ అధ్యక్షులు సోమారం రాజ్ కుమార్ జలమండలి అధికారులను కోరారు. శనివారం శ్రీ పోచమ్మ ఆలయ కమిటీ అధ్యక్షులు రాజ్ కుమార్ ఆధ్వర్యంలో రాజేంద్ర నగర్ జలమండలి డీజీఎం జోహార్ అలీని కలిసి వినతి పత్రం అందజేశారు. శ్రీ పోచమ్మ ఆలయంలో గతంలో మురునీరు వస్తుందని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సమస్య పరిష్కరించారాన్నారు. ఆలయ నూతన నిర్మాణం చేపడుతున్నామని శాశ్వత పరిష్కారం కొరకు జిఎం సాయి లక్ష్మి , డీజీఎం , జోహార్ అలీ , మేనేజర్ శ్రావ్య రెడ్డి లతో సమస్య వివరించడంతో వెంటనే డిజిఎం జోహార్ అలీ కాంటాక్టరును పిలిచి వెంటనే పనులు చేపట్టాలని ఆదేశం జారీ చేశారు.

జలమండలి అధికారులు ఆలయ కమిటీ ప్రతినిధులు ఇచ్చిన వినతిని వెంటనే పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవడానికి శ్రీకారం చుట్టడంతో కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మద్దూరి బాలసుబ్రమణ్యం, గోదల చంద్రయ్య ,మద్దూరి బాలమురళీకృష్ణ , ఉప్పల శ్రీకాంత్ పాల్గొన్నారు.



జలమండలి డిజిఎం జోహార్ కు వినతి పత్రం అందజేస్తున్న హైదర్గూడ పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సోమారం రాజకుమార్

# హర్యానా ఎన్నికలకు తెలంగాణ డబ్బులు

- మహారాష్ట్రలో జరిగే ఎన్నికలకు తెలంగాణ నుండి డబ్బులు
- హైడ్రా పేరుతో బిల్డర్ల నుండి డబ్బులు వసూలు
- అదానీ ద్వారా ఢిల్లీలో కాంగ్రెస్,బీజేపీ పార్టీలకు తెలంగాణ డబ్బులు
- బండి సంజయ్కు జ్ఞానం లేదు
- మెగా కృష్ణారెడ్డి కంపెనీని బ్లాక్ లిస్ట్ చేసే వరకు రాజకీయ పోరాటం
- ఎమ్మెల్యే కె .పి .వివేకానంద, కార్పొరేషన్ మాజీ చైర్మన్లు డా .ఎర్రోళ్ల శ్రీనివాస్,మేడె రాజీవ్ సాగర్

**హైదరాబాద్, నవంబర్ 9(నమస్తే ఉదయం):**

రోజురోజుకు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు దిగజారుతోంది. తెలంగాణలో డబ్బును దోచుకొని ఏఐసీసీకి పంపిస్తోంది. తెలంగాణను బంగారు బాతులా కాంగ్రెస్ అధిష్టానం ఉపయోగించుకుంటుంది. హర్యానా ఎన్నికలకు తెలంగాణ నుండి డబ్బులు పంపించారుమహారాష్ట్రలో జరిగే ఎన్నికలకు తెలంగాణ నుండి డబ్బులు వెళ్తున్నాయి. బిల్డర్లను,వ్యాపారులను బ్లాక్ మెయిల్ చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారుద. రేవంత్ రెడ్డి తనఇంటి నుండే కార్యకలాపాలను నడిపిస్తున్నారు. రేవంత్ రెడ్డి ఇంట్లోనే ప్రాజెక్టుల అంచనాలు తయారు అవుతున్నాయి. డబ్బులు వచ్చే వాటిపైన రేవంత్ రెడ్డి దృష్టి సారించారు.హైడ్రా పేరుతో బిల్డర్ల నుండి డబ్బులు వసూలు చేస్తున్నారు. కాంగ్రెస్ దేశంలో ఎక్కడ పోటీ చేసినా తెలంగాణ నుండి డబ్బులు పంపిస్తున్నారు. సుంకిశాల ప్రాజెక్టు నిర్మాణంలో నాణ్యతా లోపాలు జరిగితే ఏజెన్సీపై ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు?సుంకిశాల ప్రాజెక్టు ఏజెన్సీని ఎందుకు ప్రభుత్వం బ్లాక్ లిస్ట్ లో పెట్టడం లేదు? మెగా కృష్ణారెడ్డి కంపెనీని రేవంత్ రెడ్డి ఈస్ట్ ఇండియా కంపెనీ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి చేసే అవినీతిని బయటపెడతాం.

మెగా క్రిష్ణారెడ్డి కంపెనీని బ్లాక్ లిస్ట్ చేసే వరకు రాజకీయ పోరాటం చేస్తాం. కులగణన సర్వేపై ఎలాంటి చర్చలేదు. కాలగణనలో అవసరం లేని సమాచారం అడుగుతున్నారు. సర్వే బీసీ కులగణన చేస్తున్నట్లుగా లేదు. ఉన్న పథకాలు పోతాయని ప్రజలు భయపడుతున్నారు. కేసీఆర్ ఒక్కటే రోజు సమగ్ర కుటుంబ సర్వే చేశారు. కేసీఆర్ చేసిన సమగ్ర కుటుంబ సర్వేను రేవంత్ రెడ్డి వ్యతి రేకించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసే సర్వేపై అనుమానాలు ఉన్నాయి. 11 నెలల్లో ఒక్క మంచి పని రేవంత్ రెడ్డి చేయలేదు. కేసులు పెడతామని కాంగ్రెస్ మంత్రులు అంటున్నారు కేసులకు బిఆర్ఎస్ పార్టీ భయపడదు. రాహుల్ గాంధీ ఆదానీ,మోదీని డబుల్ ఇంజిన్ సర్కార్ అన్నారు.రేవంత్ రెడ్డి ఆదానీద్వారా బీజేపీకి దగ్గర అయ్యారు. తెలంగాణ భూములు ఆదానీకి కట్టబెడుతున్నారు. అదానీ ద్వారా తెలంగాణ డబ్బులు ఢిల్లీలో కాంగ్రెస్,బీజేపీ పార్టీలకు వెళ్తున్నాయి.

బండి సంజయ్ కేంద్ర మంత్రి అనే సోయి మర్చిపోయారు. బండి సంజయ్ రెండు సార్లు ఎమ్మెల్యేగా ఓడిపోయారు.మోడీ ఫోటోతో బండి సంజయ్ రెండు సార్లు ఎంపీ అయ్యారు. బండి



సంజయ్ రేవంత్ రెడ్డికి వత్తాసు పలుకుతున్నారు. బండి సంజయ్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. రేవంత్ రెడ్డిని బండి సంజయ్ కాపాడుతున్నారు. రాష్ట్రంలో బిజెపి, కాంగ్రెస్ పార్టీల పొత్తుతో ప్రభుత్వం నడుస్తోంది.రేవంత్ రెడ్డి రాష్ట్రం మొత్తం తిరిగి బీజేపీ ఎంపీలను గెలిపించారు.బండి సంజయ్ రెండు సార్లు ఎంపీగా గెలిచి ఏం చేశారు? బండి సంజయ్కు జ్ఞానం లేదు. మేము అవినీతి చేస్తే కేంద్రంలో అధికారంలో ఉండి మీరు ఏం చేశారు?కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 33 శాఖలపై విచారణ చేశారు ఏం తేల్చారు? కాంగ్రెస్,బీజేపీ పార్టీలకు అధికారం ఉంది. ఎందుకు బయటపెట్టడం లేదు? రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీని ఎందుకు బీజేపీ ప్రశ్నించడంలేదు?

రేవంత్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీని ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు బీజేపీ ఎంపీలు కాపాడుతున్నారు. ఢిల్లీలో కాంగ్రెస్,బీజేపీ పార్టీలకు ముడుపులు ముడుతున్నాయి. బిఆర్ఎస్ పార్టీ లేకపోతే పొంగులేటికి రాజకీయ భిక్ష లేదు. కేసీఆర్,కేటీఆర్ పొంగులేటికి రాజకీయ భిక్ష పెట్టారు. మీరు ఎన్ని కేసులు పెట్టినా బిఆర్ఎస్ పార్టీని ఏం చేయలేదు. బిఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక వడ్డీతో సహా చెల్లిస్తాం. దొంగ కేసులు పెట్టి ఇరికించాలని చూస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నేతలకు ఏం చేతకాదు.

**Printed and Published MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy,Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.Damodhar Reddy. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733